http://www.agnidharanews.com

# అగ్నిధార

మంగళవారం 17 జూన్ 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5   వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ కొందరికే చుట్టంగా మారింది

మొదటి రోజు నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని భారాస నేతలు కుట్ర చేశారు.

భారాస ప్రభుత్వం పదేళ్లలో రుణమాఫీ చేయలేకపోతే మేం ఆరు నెలల్లోనే చేసి చూపించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది

## రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రైతువేదికల్లో

# ‘రైతునేస్తం’



### రైతుల కోసం రూ.1.01 లక్షల కోట్లు ఖర్చు చేశాం: రేవంత్‌రెడ్డి

రంగారెడ్డి

గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ కొందరికే చుట్టంగా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మొదటి రోజు నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని భారాస నేతలు కుట్ర చేశారని మండిపడ్డారు. ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం రైతుల కోసం రూ.1.01 లక్షల కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. భారాస ప్రభుత్వం పదేళ్లలో రుణమాఫీ చేయలేకపోతే మేం ఆరు నెలల్లోనే చేసి చూపించిన ఘనత కాంగ్రెస్ - మిగతా3లో



## భయంతో చచ్చిపోతున్నాం

- భారతీయుల తరలింపునకు కేంద్రం ఆపరేషన్!
- ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న వేళ ఇరాన్‌లో విదేశీయుల తరలింపునకు ఆ దేశ అధికారులు అనుమతి
- ఇరాన్‌లో సుమారు పదివేల మంది భారతీయులు ఉన్నట్టు తెలుస్తోంది
- ఆపరేషన్ పేరుతో ఖరారు చేయాల్సి ఉన్నట్టు సమాచారం.



## మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం

- 140 కోట్ల భారతీయులకు దక్కిన గౌరవం
- ‘గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3’ ప్రధానం
- ఇరుదేశాల సంస్కృతి, సోదరభావం, వసుదైవ కుటుంబ భావనకు ప్రతీక
- రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌లో భారత ప్రధాని ఒకరు పర్యటించడం ఇదే ప్రథమం.



## రెండు విడతల్లో కుల-జనగణన

- ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం జనగణనపై గెజిట్ విడుదల
- జమ్ముకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్, లడఖ్‌లో.. 2026 అక్టోబర్ 1 నాటికి కుల జనగణన ముగియనుంది.
- మిగతా రాష్ట్రాల్లో 2027మార్చి 1నాటికి జనగణన పూర్తి
- 15 ఏళ్ల తర్వాత దేశంలో జన గణన
- పౌరులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వీయ గణనను కూడా ఎంచుకోవచ్చు

## వైద్య కళాశాలల్లో పూర్తి స్థాయి

# వసతులు ఉండాలి

- వైద్య కళాశాలల పనులపై కార్యాచరణ ప్రణాళిక
- కళాశాలల్లో క్షేత్ర స్థాయి పరిశీలనకు అధికారులతో కమిటీ
- మూడేళ్లలో అన్ని కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో ఉండాలి
- నర్సింగ్ కళాశాలల్లో ఆప్షనల్‌గా జపనీస్ ఉండాలి...
- వైద్యారోగ్య సమీక్షలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి



హైదరాబాద్:

రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో పని చేయాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వెంటనే తయారు చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ప్రతి కళాశాలను సందర్శించి అక్కడ ఏం అవసరాలు ఉన్నాయి... ఎంత మేర నిధులు కావాలి.. తక్షణమే పూర్తి చేయాల్సిన పనులు... ప్రభుత్వపరంగా అందించాల్సిన సహాయం తదితర వివరాలతో నివేదికను సమర్పించాలని సీఎం ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలల్లో పూర్తి స్థాయి వసతులు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అన్ని కళాశాలల్లో మూడేళ్లలోగా వసతుల నిర్మాణం పూర్తి అవ్వాలని నిర్దేశించారు. ప్రతి కళాశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు అధికారుల కమిటీని నియమిస్తున్నట్లు ప్రకటించారు. వైద్య కళాశాలల అవసరాలు, నిధుల వివరాలతో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఖాళీల భర్తీ, సిబ్బంది ప్రమోషన్లపై చర్చించారు. అనుబంధ ఆస్పత్రుల్లో - మిగతా3లో



## నిలకడగా సోనియా గాంధీ ఆరోగ్యం

- వెల్లడించిన ఆస్పత్రి వర్గాలు
- అనారోగ్య సమస్యలతో ఆదివారం ఆమె ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే
- ప్రస్తుతం ఆమె ఆరోగ్యపరిస్థితిని వైద్యులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆస్పత్రి చైర్మన్ అజయ్ స్వరూప్ వెల్లడి

## అధిష్టానంతో సంప్రదించకుండా

# ప్రకటనలు చేయొద్దు





- మంత్రి పొంగులేటిపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సీరియస్
- కేబినెట్ అంశాలను ముందుగానే మీడియాతో మాట్లాడితే ఎలా అంటూ మండిపడ్డారు
- ఒకరి మంత్రిత్వ శాఖపై మరొకరు మాట్లాడటమేంటి

హైదరాబాద్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ సీరియస్ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఆదివారం పొంగులేటి ప్రకటన చేశారు. ఈ విషయంలోనే పొంగులేటిపై పీసీసీ చీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అంశంతో ముడిపడిన ఎన్నికలపై పొంగులేటి ప్రకటనను టీపీసీసీ చీఫ్ తప్పుబట్టారు. కేబినెట్ అంశాలను ముందుగానే మీడియాతో మాట్లాడితే ఎలా అంటూ మండిపడ్డారు. ఒకరి మంత్రిత్వ శాఖపై మరొకరు మాట్లాడటమేంటని ప్రశ్నించారు. - మిగతా3లో



## ఆ వంతెన ప్రమాదకరమని ముందే హెచ్చరించాం

- సీఎం దేవేంద్ర ఫడణవీస్
- దీని తీవ్రత గురించి తెలియక పర్యటకులు దానిపైకి వెళ్లి ఉంటారు
- తుప్పు పట్టిన వంతెన బరువు ఆపలేక కూలిపోయింది
- అయితే.. కొత్త బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

## నా అరెస్ట్ తప్పదు..

# ఎవర్నీ వదలను..



- తెలంగాణ కోసం అనేక సార్లు జైలుకు వెళ్లిన వ్యక్తిని
- ఫార్ములా ఈ-రేస్ అంశం నాలుగు గోడల మధ్య నన్ను విచారించడం కాదు
- అసెంబ్లీ సాక్షిగా నాలుగు కోట్ల ప్రజల ముందు చర్చిద్దామని సవాల్
- చర్చించే దమ్ము, ధైర్యం లేక రేవంత్ రెడ్డి పారిపోయారు
- వారం కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరైన సమాధానాలు చెప్పారు.

హైదరాబాద్

తెలంగాణ కోసం అనేక సార్లు జైలుకు వెళ్లిన వ్యక్తిని తాను అన్నారు. ఫార్ములా ఈ-రేస్ అంశం నాలుగు గోడల మధ్య నన్ను విచారించడం కాదన్నారు. అసెంబ్లీ - మిగతా3లో

# రెండు విడతల్లో కుల-జనగణన




**ముంబై :** దేశంలో 15 ఏళ్ల తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు జన గణన జరగనుంది. రెండు దశల్లో పూర్తి కానున్న జన, కుల గణన పూర్తి చేయాలని హోం మంత్రి అమిత్ షా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం జనగణనపై గెజిట్ విడుదల చేసింది. దేశంలో రెండు విడతల్లో జనగణన జరగనుంది. జమ్ముకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్, లడఖ్‌లో.. 2026 అక్టోబర్ 1 నాటికి కుల జనగణన ముగియనుంది. మిగతా రాష్ట్రాల్లో 2027మార్చి 1నాటికి జనగణన పూర్తికానుంది. 15 ఏళ్ల తర్వాత దేశంలో జన గణన జరగనుంది. దీనికి సంబంధించింది కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 1948 జనాభా లెక్కల చట్టం (1948లో 37)లోని సెక్షన్ 3 ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ జనగణన చేపట్టాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో రెండు విడుతల్లో జన గణన జరగనుంది. 2026 అక్టోబర్ 1 నాటికి జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్, లడఖ్ లో జన గణన ప్రక్రియ ముగియనుంది. మిగతా రాష్ట్రాల్లో 2027 మార్చి 1 నాటికి జన గణన పూర్తి కానుంది. జనగణనతో పాటే కులగణన సైతం కేంద్రం నిర్వహించనుంది..జన గణన ఏవిధంగా జరపాలని అన్న దానిపై ఉన్నతాధికారులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే సమీక్ష జరిపారు. జనగణన కోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పనిచేయనున్నారు. డిజిటల్ రూపంలోనే ట్యాబ్ ల ద్వారా జనాభా లెక్కల సేకరణ కొనసాగనుంది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యాప్లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదుచేసే వెసులుబాటు ఉండనుంది.. జన, కుల గణనలో డేటా భద్రత కోసం కేంద్ర హోంశాఖ కఠినమైన చర్యలు తీసుకుంది.. సమాచారం సేకరణ, బదిలీ, స్టోరేజీని కోసం అత్యంత కట్టుదిట్టంగా భద్రతా చర్యలను తీసుకోనుంది హోంశాఖ..ప్రస్తుతం అధికారిక లెక్కల ప్రకారం.. భారత జనాభా 140 కోట్లు.. చైనా తరువాత అత్యంత అధిక జనాభా కలిగిన దేశంగా భారత్ ఉంది. 2011 లో చివరిసారి జన గణన జరిగింది. కోవిడ్ కారణం వల్ల 2021 లో జరగాల్సిన జన గణన వాయిదా పడింది. స్వతంత్ర భారత చరిత్రలో కుల ఆధారిత జన గణన జరగడం ఇదే తొలిసారి. ఈసారి జరిగే జన గణన వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లలో మార్పులు, మహిళా రిజర్వేషన్లు, డిలిమిటేషన్ నియోజవర్గాల పునర్విభజనకు ప్రామాణికంగా ఉండనుంది.ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేపట్టి రిజర్వేషన్లలో మార్పులు తీసుకువచ్చింది. మరి కేంద్రం చేసే జన కుల గణన దేశంలో ఎటువంటి మార్పులు తీసుకువస్తుందో వేచి చూడాలి

### 16వ జనగణన


2027 మార్చి 1వ తేదీ నాటికి రెండు దశల్లో పూర్తి కానున్న జన, కుల గణన పూర్తి చేయాలని హోం మంత్రి అమిత్ షా అధికారులను ఆదేశించారు.. జనగణన కోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పనిచేయనున్నారు. డిజిటల్ రూపంలోనే ట్యాబ్ ల ద్వారా జనాభా లెక్కల సేకరణ సాగనుంది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యాప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదుచేసే వెసులుబాటు కల్పిస్తున్నారు. డేటా భద్రత కోసం కేంద్ర హోంశాఖ కఠినమైన చర్యలు తీసుకుంటుంది. సమాచారణ సేకరణ, బదిలీ, స్టోరేజీని హోంశాఖ అత్యంత కట్టుదిట్టంగా చేపడుతున్నట్లు తెలిపింది. సెక్షన్ 3, జనగణన చట్టం, 1948 ప్రకారం జన-కులగణనను చేపట్టనున్నట్టు వివరించింది. మొత్తంగా 16వది. స్వాతంత్ర్యానంతరం చేపట్టబోయే 8వ జన గణన ఇది. తొలి దశలో భాగంగా హిమాలయ ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, లద్దాఖ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో జరుగుతుంది. తొలి విడత ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి జరుగుతుంది. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో రెండో దశలో 2027, మార్చి 1 నుంచి జన గణనను చేపట్టనున్నారు. ఈసారి జనాభా లెక్కలతోపాటే కుల గణనను కూడా చేపట్టనున్నారు.దేశంలో 1872 నుంచి జనగణన చేస్తున్నారు. సాధారణంగా జనగణనను పదేళ్లకోసారి నిర్వహిస్తారు. చివరిసారిగా 2011లో జనగణన చేపట్టారు. అప్పుడు కూడా రెండు విడుతల్లో ఈ ప్రక్రియ జరిగింది. ఆ ప్రకారంగా 2021లోనే జన గణనను నిర్వహించాలి. అయితే నాటి కొవిడ్ కల్లోలపరిస్థితుల కారణంగా ఈ ప్రక్రియ వాయిదా పడింది. దీంతో తాజాగా 16 ఏళ్ల తర్వాత మళ్లీ జనాభా గణనను కేంద్రం ఉపక్రమించింది. జనాభా లెక్కల సేకరణకు కేంద్రం 30కి పైగా ప్రశ్నలను సిద్ధం చేసింది. ఇక 2021లో జనగణన కోసం ప్రభుత్వం రూ.12,695.58 కోట్లను కేటాయించగా.. ఈసారి జనగణనకు రూ. 13 వేల కోట్ల వరకూ వ్యయం అయ్యే అవకాశం ఉండగా.. ప్రస్తుతానికి కేంద్రం 2025-26 బడ్జెట్‌లో కేవలం రూ. 574.80 కోట్ల నిధులను మాత్రమే కేటాయించింది.

## దయచేసి ఆపండి..
## ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఎయిరిండియా బాధిత కుటుంబం విజ్ఞప్తి



**ఇంటర్‌నెట్ డెస్క్:** అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనలో 241 మంది విమాన ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఓ వైపు ప్రమాదంలో తమ వారు ప్రాణాలు కోల్పోయారనే షాక్ నుంచి ఇప్పటికీ వారి కుటుంబ సభ్యులు తేరుకోలేకపోతున్నారు. తమ వారి మృతదేహాల కోసం తిండీ నిద్రా లేకుండా ఘటనా స్థలంలో నాలుగు రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు మృతులకు సంబంధించిన ఫొటోలు, పలు వీడియోలను ఉపయోగించుకొని పలువురు ఇన్‌ఫ్లుయెన్సర్లు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తుండడంతో విసుగు చెందిన మృతుల కుటుంబసభ్యులు ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రాజస్థాన్‌లోని బాంస్‌వాడకు చెందిన డాక్టర్ కోమి వ్యాస్ భార్యాపిల్లలతో విమాన ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. వారి కుటుంబానికి చెందిన ఫేక్, ఫొటోలను పలువురు నెటిజన్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారని కోమి వ్యాస్ బంధువు కుల్దీప్ భట్ ఆరోపించారు. లైక్స్, వ్యూస్ కోసం ప్రమాద ఘటనకు సంబంధించిన వీడియోలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. "మా కుటుంబానికి వచ్చిన కష్టంతో ఇప్పటికే మేమంతా మానసికంగా కుంగిపోయి ఉన్నాం. మాలాగే మరో 270కి పైగా కుటుంబాలు తమ వారిని కోల్పోయి విచారంలో మునిగిపోయి ఉన్నాయి. కానీ ఇవేవీ పట్టించుకోకుండా కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్లు వారి లైక్‌లు, కామెంట్ల కోసం ప్రమాదానికి సంబంధించిన వీడియోలను దుర్వినియోగం చేస్తున్నారు. కోమి కుటుంబం విమానం ఎక్కగానే దిగిన ఫొటో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆ ఫొటో నుంచి ఏఐ వీడియోలు చేస్తున్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుమార్తె మిరియా (8)కు చెందినదని ఓ మృతదేహం ఫొటోను షేర్ చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆమెకు దహన సంస్కారాలు చేస్తున్నట్లు మరికొన్ని వీడియోలు కూడా పెడుతున్నారు. చిన్నారి శరీరం పూర్తిగా కాలి బూడిదయ్యిందని వదంతులు సృష్టిస్తున్నారు. కోమి పేరుతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు తెరిచి.. వారి ఫొటోలు దుర్వినియోగం చేస్తున్నారు. ఇప్పటివరకు వారి మృతదేహాలు కూడా దొరకకపోవడంతో శోకసంద్రంలో మునిగిపోయి ఉన్నాము. లైకుల కోసం తప్పుడు ప్రచారాలు వ్యాప్తి చేస్తూ.. మమ్మల్ని మరింత క్షోభకు గురిచేయకండి" అని విజ్ఞప్తి చేశారు. గురువారం మధ్యాహ్నం 1.38 గంటలకు అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. టేకాఫ్ అయిన క్షణాల్లోనే విమానాశ్రయానికి సమీపంలో ఉన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నివాస ప్రాంతం వద్ద కూలిపోవడంతో మొత్తం 274 మంది మృతిచెందారు. రాజస్థాన్‌కు చెందిన డాక్టర్ కోమి వ్యాస్ ఇటీవలే లండన్‌కు వెళ్లారు. తన కుటుంబాన్ని కూడా లండన్‌కు తీసుకెళ్లేందుకు ప్రమాదం జరగడానికి రెండు రోజుల క్రితమే ఇండియాకు తిరిగివచ్చారు. ఎన్నో ఆశలతో కుటుంబమంతా కలిసి లండన్‌కు బయలుదేరగా ఈ ప్రమాదంలో వారంతా ప్రాణాలు కోల్పోయారు.

## మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం..



**నికోసియా:** సైప్రస్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3' ను ప్రధానం చేశారు. ప్రధాని ఈ గౌరవాన్ని స్వీకరిస్తూ ఇరుదేశాల మధ్య ఉన్న స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ చేతుల మీదుగా మోదీ ఈ పురస్కారం అందుకున్నారు. రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ తొలి అధ్యక్షుడు మకరియోస్ 3 పేరుతో ఈ అత్యున్నత పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. సైప్రస్ ప్రభుత్వ అవార్డు 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరుదేశాల సంస్కృతి, సోదరభావం, వసుదైవ కుటుంబ భావనకు ప్రతీక అని చెప్పారు. రెండు దేశాల మధ్య క్రియాశీల భాగస్వామ్యం కొత్త శిఖరాలకు చేరుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌లో భారత ప్రధాని ఒకరు పర్యటించడం ఇదే ప్రథమం. అవార్డు ప్రదానానికి సంబంధించిన వీడియోను ప్రధాని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సైప్రస్ అవార్డు అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ఇరుదేశాల మధ్య స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నామని చెప్పారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్న ప్రధానికి నికోస్ క్రిస్టోడౌలిడెస్ విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. సైప్రస్ పర్యటన అనంతరం కెనడాకు మోదీ పయనమవుతారు. అక్కడ జరుగనున్న జీ-7 సదస్సులో పాల్గొంటారు. చివరిగా క్రొయేషియాలో అధికారిక పర్యటన జరుపుతారు.

## ఆ వంతెన ప్రమాదకరమని ముందే హెచ్చరించాం



**పుణె:** మహారాష్ట్రలోని ఇంద్రాయణి నదిపై వంతెన కూలిపోయిన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ఈ వంతెన ప్రమాదకరమని ఘటన జరగకముందే హెచ్చరించామని తెలిపారు. దీని తీవ్రత గురించి తెలియక పర్యటకులు దానిపైకి వెళ్లి ఉంటారని అన్నారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రమాద ఘటన జరగకముందే ఆ వంతెన ప్రమాదకరమని స్థానిక కలెక్టర్ ఇప్పటికే ప్రకటించారు. అక్కడ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. కానీ, దాని తీవ్రత గురించి తెలియక అధిక సంఖ్యలో వంతెన పైకి వెళ్లారు. తుప్పు పట్టిన వంతెన బరువు ఆపలేక కూలిపోయింది. అయితే.. కొత్త బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఆ దిశగా చర్యలు కొనసాగుతున్నాయి" అని ఫడణవీస్ తెలిపారు. ఈ ప్రమాదం తర్వాత పర్యాటక ప్రాంతాల్లో భద్రతా చర్యలు మరింత బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా.. పుణె జిల్లాలోని ఇంద్రాయణి నదిపై కుందమాలా పర్యాటక ప్రాంతానికి ఆదివారం పర్యటకులు అధిక సంఖ్యలో వచ్చారు. అక్కడున్న ఇనుప వంతెనపై అనేక మంది వచ్చి నిలబడిన క్రమంలోనే కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో అనేక మంది పర్యటకులు గల్లంతయ్యారు. వీరిలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

## 'భయంతో చచ్చిపోతున్నాం'



**ఢిల్లీ:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం నడుస్తోంది. బాంబు దాడుల కారణంగా భయాందోళన వాతావరణం నెలకొంది. మరోవైపు.. ఇజ్రాయెల్‌లో ఉన్న వివిధ దేశాల ప్రజలు ఎప్పుడేం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పట్టుకుని కాలం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌లో ఉన్న భారతీయులకు తరలించేందుకు ?కేంద్రం ఆపరేషన్ చేపట్టనున్నట్టు తెలుస్తోంది. ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న వేళ ఇరాన్‌లో విదేశీయుల తరలింపునకు ఆ దేశ అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో ఇరాన్‌లో ఉన్న భారతీయులను తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ చేపట్టనుంది. ఇరాన్‌లో సుమారు పదివేల మంది భారతీయులు ఉన్నట్టు తెలుస్తోంది. ఆపరేషన్ పేరుతో ఖరారు చేయాల్సి ఉన్నట్టు సమాచారం. అయితే, ప్రస్తుతం గగనతలం మూసివేసినందున.. భూసరిహద్దుల మీదుగా విదేశీయులకు తీసుకెళ్లొచ్చని ఇరాన్ విదేశీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ఇరాన్‌లో తమ పరిస్థితి దినదినగండంగా ఉందని భారతీయ విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తాము నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీలైనంత త్వరగా తమను స్వదేశానికి తీసుకెళ్లాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి వైద్య విద్యార్థి ఇంతిసాల్ మొహిదీన్ మాట్లాడుతూ..'శుక్రవారం తెల్లవారుజామున భారీ పేలుడు శబ్దాలతో నిద్రలో నుంచి ఉలిక్కిపడి లేచా. నాతోపాటు చాలామంది బేస్‌మెంట్‌కు పరుగులు తీశాం. అప్పటినుంచి మాకు నిద్ర లేని రాత్రులే మిగిలాయి.

## విమానం మండుతుండగా నడుచుకుంటూ బయటకు.. మృత్యుంజయుడి మరో వీడియో



ఇంటర్నెట్ డెస్క్: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం నుంచి అనూహ్య రీతిలో ప్రాణాలతో బయటపడ్డారు విశ్వాస్‌కుమార్ రమేశ్ ప్రమాదం అనంతరం ఆయన నడచుకుంటూ అంబులెన్స్ ఎక్కిన దృశ్యాలు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయనకు సంబంధించి మరో వీడియో బయటికొచ్చింది. అందులో ఆయన ప్రమాద స్థలం నుంచి నడుచుకుంటూ వస్తోన్న దృశ్యాలు ఉన్నాయి. విమానం నివాస సముదాయాల మధ్య బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై కూలగానే స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు ప్రమాదం గురించి పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో తెలుపు రంగు టీషర్ట్ ధరించిన ఓ వ్యక్తి చేతిలో మొబైల్ ఫోన్ పట్టుకుని ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి రోడ్డుపైకి రావడం గమనించారు. ఆయనను చూసి తొలుత వారు షాక్ అయ్యారు. ఆ తర్వాత శరీరంపై గాయాలు చూసి వెంటనే అక్కడి నుంచి తీసుకెళ్లారు. అనంతరం ఆ వ్యక్తి.. ప్రమాదానికి గురైన విమానంలోని ప్రయాణికుడు విశ్వాస్ కుమార్ రమేశ్ అని తెలిసింది. ఘటనాస్థలం నుంచి ఆయన బయటకు వస్తుండగా వెనుక విమానం కాలిపోయిన దృశ్యాలు ఈ వీడియోలో కన్పించగా.. ప్రమాదం కారణంగా అక్కడ భారీ ఎత్తున పొగ అలుముకుంది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. బ్రిటన్‌లో నివాసముంటున్న విశ్వాస్‌కుమార్.. గుజరాత్‌లోని తన కుటుంబాన్ని కలిసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన ఎయిరిండియా (%ూఅతీ ×అఎఖు%) విమానంలోని 11-ఏ సీటులో ఆయన కూర్చున్నారు. విమానం కూలగానే తన సీటు విరిగి కింద పడిపోయిందని.. అందుకే విమానంలో చెలరేగిన మంటలు తనకు అంటుకోలేదని ఇటీవల తెలిపారు. కళ్లు తెరిచి చూసేసరికి హాస్టల్ భవనం శిథిలాల్లో ఉన్నట్టు.. శిథిలాల నుంచి మెల్లగా నడుచుకుంటూ బయటకు వచ్చానని అన్నారు. ఈ ప్రమాదంలో విమానంలో 241 మంది ప్రాణాలు కోల్పోగా.. విశ్వాస్ ఒక్కరే మృత్యుంజయుడిగా బయటపడ్డారు. ఇక, విమానం భవనంపై కూలడంతో అందులోని 33 మంది మృతిచెందిన సంగతి తెలిసిందే.

## నిలకడగా సోనియా గాంధీ ఆరోగ్యం..

**ఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఆరోగ్యం మెరుగుపడుతోంది. అనారోగ్య సమస్యలతో ఆదివారం ఆమె ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలోని గ్యాస్ట్రో విభాగంలో చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యపరిస్థితిని వైద్యులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆస్పత్రి చైర్మన్ అజయ్ స్వరూప్ వెల్లడించారు. ఈ నెల 9న సోనియా ఇదే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కొన్ని రోజుల క్రితం శిమ్లా పర్యటనలో ఉన్న ఆమెకు రక్తపోటు ఎక్కువకావడంతో అక్కడ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న విషయం తెలిసిందే.

## భారీ పేలుడు.. ఐదుగురు మహిళలు మృతి, తొమ్మిది మందికి గాయాలు

ఉత్తర ప్రదేశ్‌లోని బాణసంచా కర్మాగారంలో సోమవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో తొమ్మిది మంది మహిళలకు తీవ్రగాయాలు అయ్యాయి. వీరందరినీ హుటాహుటిన దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించారు. అటార్సి గ్రామంలోని టపాసుల తయారీ కేంద్రంలో ఈ పేలుడు సంభవించింది. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి అత్యవసర సేవలైన అగ్నిమాపక, అంబులెన్స్, పోలీసులు భారీగా చేరుకున్నారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఈ ఘటనపై రాజబ్‌పూర్ పోలీస్ స్టేషన్ అధికారి మాట్లాడుతూ.. 'ఈ రోజు మధ్యాహ్నం 12 గంటలకు అటార్సిలోని లైసెన్స్ పొందిన బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు, అంబులెన్స్, అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళా కార్మికులు మరణించారు. తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు.


## సంపాదకీయం

# ఇరాన్,ఇజ్రాయిల్ వార్..... ఏం జరుగుతోంది

ఇరాన్‌పై దాడులకు ఆ దేశ అణు కార్యక్రమాలే కారణమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చెప్పారు. అవి తమ దేశ మనుగడకు ముప్పు అని తెలిపారు. కానీ దీని వెనుక ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చడమనే విస్తృత లక్ష్యం కూడా ఉన్నట్టుంది.ఈ దాడుల వల్ల ఉత్పన్నమయ్యే వరుస పరిణామాలు ప్రజలలో అశాంతిని రేకెత్తించి ఇరాన్ పాలకుల పతనానికి దారితీస్తాయని ఆయన ఆశిస్తున్నారు.ఇరాన్ ప్రజలు కలిసి రావాల్సిన సమయం ఆసన్నమైంది, మీ గర్వించదగ్గ చరిత్రను తలుచుకొని, ఈ క్రూరమైన, కఠినమైన ప్రభుత్వం నుంచి స్వేచ్ఛ కోసం పోరాడాలి” అని పిలుపునిచ్చారు.ఇరాన్ ఆర్థిక దుస్థితి,భావప్రకటన స్వేచ్ఛ కొరవడటం, మహిళలు, మైనారిటీ వర్గాల హక్కులను పరిమితం చేయడంపై చాలామంది ఇరాన్ ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు.ఇజ్రాయెల్ దాడి ఇరాన్ నాయకత్వానికి నిజమైన ముప్పుగా పరిణమిస్తోంది. ఈ దాడుల్లో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్, ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, ఐఆర్‌జీసీ సీనియర్ అధికారులు మరణించారు. అయితే, ఇజ్రాయెల్ దాడులు ఇంకా ముగియలేదు.ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. ఇజ్రాయెల్‌లోని సైనిక స్థావరాలు, లక్ష్యాలపై దాడి చేసినట్లు రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది.ఇరుదేశాలు దాడులకు దిగడంతో , పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరాన్ క్షిపణి దాడుల తర్వాత, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు “మరికొన్ని దాడులు చేస్తాం” అని హెచ్చరించారు.ఇరాన్‌లోని కొందరు నాయకులను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకోవచ్చు. ఈ దాడులు ఇరాన్ ప్రభుత్వాన్ని కదిలించి, ప్రజలు పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలని ఇజ్రాయెల్ ఆశిస్తూ ఉండవచ్చు. నెతన్యాహు కోరుకుంటున్నది ఇదే.కానీ ఇదొక జూదం - చాలా పెద్దది. ఎందుకంటే, అటువంటిది జరుగుతుందని స్పష్టమైన సంకేతం లేదు. నిరసనలు ప్రారంభమైనప్పటికీ, ఇదంతా ఎక్కడికి వెళుతుందో తెలియదు.ఇరాన్‌లో సైన్యాన్ని, ఆర్థిక వ్యవస్థను నియంత్రించే వారి చేతుల్లోనే నిజమైన అధికారం ఉంది. ఇందులో ఎక్కువగా ఐఆర్‌జీసీకి చెందిన వారు, ఇతర ఎన్నిక కాని గ్రూపుల వారున్నారు. వారు ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవలసిన అవసరం లేదు, ఎందుకంటే, అది ఇప్పటికే వారి చేతుల్లో ఉంది. వారు మరింత దూకుడుగా స్పందించవచ్చు.ప్రస్తుత సంక్షోభానికి మరొక ఫలితం ఏమిటంటే, ఇరాన్ ప్రభుత్వం కూలిపోయి, దేశాన్ని గందరగోళంలో పడేయవచ్చు. ఇరాన్‌లో దాదాపు 9 కోట్ల జనాభా ఉంది, కాబట్టి ఇక్కడి విషయాలు మిడిల్ ఈస్ట్ అంతటా ప్రభావాన్ని చూపవచ్చు.ఇరాన్‌లో తిరుగుబాటు వచ్చి, కొత్త, స్నేహపూర్వక ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఇజ్రాయెల్ ఆశిస్తున్నట్లు కనిపిస్తోంది.కానీ పెద్ద ప్రశ్న ఏమిటంటే - ఎవరు అధికారం చేపడతారు?.ఇటీవలి సంవత్సరాలలో ఇరాన్ ప్రతిపక్షాలు విడిపోయాయి.2022లో “స్త్రీ జీవితం, స్వేచ్ఛ” పేరుతో సాగిన ఉద్యమంలోని నిరసనలు ఇరాన్‌ను కుదిపేశాయి. దీంతో ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యతిరేక గ్రూపులను, వ్యతిరేక గళాలను ఏకం చేయడానికి కొంతమంది ప్రతిపక్ష నాయకులు ప్రయత్నించారు.అయితే, వారి ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఉద్యమానికి ఎవరు నాయకత్వం వహించాలి? ప్రస్తుత ప్రభుత్వాన్ని ఏ విధమైన వ్యవస్థ ద్వారా భర్తీ చేయాలి? అనే దానిపై వారిలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.ఇరాన్‌ను నడిపించడానికి అక్కడి కొన్ని ప్రతిపక్ష గ్రూపులను లేదా వ్యక్తులను ఇజ్రాయెల్ ప్రత్యామ్నాయాలుగా చూడవచ్చు.ఇరాన్ మాజీ క్రౌన్ ప్రిన్స్ రెజా పహ్లావి ఇందుకు ఒక ఉదాహరణ.1979 ఇస్లామిక్ విప్లవం సమయంలో ఆయన తండ్రి షాను అధికారం నుంచి తొలగించారు. రెజా పహ్లావి ప్రస్తుతం ఇరాన్ బయట నివసిస్తున్నారు. ఇతర దేశాల మద్దతు కోసం ఆయన ప్రయత్నిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాలలో రెజా ఇజ్రాయెల్‌ను కూడా సందర్శించారు .కొంతమంది ఇరానియన్లు రెజాకు మద్దతు ఇస్తున్నప్పటికీ, అది ఇరాన్ ప్రభుత్వంలో త్వరగా మార్పు తీసుకురావడానికి తగినంత బలంగా ఉందో లేదో స్పష్టంగా లేదు.ఇరాన్‌ను నడిపించడానికి అక్కడి కొన్ని ప్రతిపక్ష గ్రూపులను లేదా వ్యక్తులను ఇజ్రాయెల్ ప్రత్యామ్నాయాలుగా చూడవచ్చు.బహిష్కరణకు గురై, ప్రవాసంలో ఉంటున్న ముజాహిదీన్-ఇ ఖల్క్ (ఎంఈకే) అనే ఒక ప్రతిపక్ష గ్రూపు కూడా ఉంది. వారు ఇరాన్ ఇస్లామిక్ ప్రభుత్వాన్ని దించాలని కోరుకుంటున్నారు కానీ, రాచరిక పాలనను వ్యతిరేకిస్తున్నారు.ఎంఈకే ఒక వామపక్ష ముస్లిం గ్రూపుగా ప్రారంభమైంది, ఇరాన్ మాజీ రాజు (షా)ను తీవ్రంగా వ్యతిరేకించింది.1979 విప్లవం తర్వాత ఈ గ్రూపు ఇరాక్‌కు వెళ్లింది, 1980లలో జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధంలో సద్దాం హుస్సేన్ పక్షాన నిలిచింది. ఈ నిర్ణయం వల్ల చాలామంది ఇరానియన్లు ఎంఈకే గ్రూపును వ్యతిరేకించారు.ఎంఈకే ఇప్పటికీ చురుకుగా ఉంది. అమెరికాలో ముఖ్యంగా డోనల్డ్ ట్రంప్‌కు దగ్గరగా ఉన్న కొందరితో స్నేహం ఉంది. ట్రంప్ మొదటి పదవీకాలంలో మైక్ పాంపియో, జాన్ బోల్టన్, రూడీ గియులియాని వంటి సీనియర్ యూఎస్ అధికారులు ఎంఈకే కార్యక్రమాలలో ప్రసంగించారు.అయితే, ఈ గ్రూపుకు ఇప్పుడు వైట్‌హౌస్‌లో తక్కువ ప్రభావం ఉన్నట్లు కనిపిస్తోంది.కొన్నిపార్టీలు లౌకిక ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటుండగా, మరికొన్ని పార్లమెంటరీ రాచరికానికి మద్దతు ఇస్తున్నాయి.ఇక, జూన్ 13 దాడులపై ఇప్పుడే ఓ అంచనాకు రాలేం. గత సంవత్సరం కూడా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పోరాటం జరిగింది. దాన్ని ప్రభుత్వాన్ని దించడానికి ఒక అవకాశంగా ఇరానియన్లు భావించినట్లు బలమైన సంకేతాలు కనిపించలేదు.ఇజ్రాయెల్‌లోని అనేక లక్ష్యాలను ఇరాన్ ఛేదించినప్పటికీ, దానికి అంత మంచి అవకాశాలు ఉన్నట్లు అనిపించడం లేదు.అమెరికాతో మళ్లీ చర్చలు ప్రారంభించి, ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నించడం ఇరాన్‌కు సురక్షితమైన మార్గం అని కొంతమంది భావిస్తున్నారు.కానీ, ఇరాన్ నాయకులకు ఇది ఇబ్బందికరం. ఎందుకంటే, ట్రంప్ డిమాండ్ మేరకు చర్చలకు వస్తే, వారు ఓటమిని అంగీకరించినట్లేనని అనుకుంటారు.ఇరాన్‌కు ఉన్న మరో ప్రత్యామ్నాయం ఏమిటంటే, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా దానిపై దాడి చేస్తూ ఉండటం. ప్రస్తుతం వారు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నది ఇదే అనిపిస్తోంది.ప్రతీకారం తీర్చుకుంటామని తమ మద్దతుదారులకు ఇరాన్ నాయకులు హామీ ఇచ్చారు. అలాగే కొనసాగిస్తే, ఇజ్రాయెల్ ప్రతిస్పందన దాడులకు దిగవచ్చు.ఆ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలు, రాయబార కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ గతంలో కూడా బెదిరించింది. కానీ, అదంత సులభం కాదు, అలా చేస్తే అమెరికాను నేరుగా ఈ వివాదంలోకి లాగినట్లవుతుంది, ఈ పరిణామం తలెత్తకుండా ఇరాన్ నిజంగా నివారించాలనుకుంటోంది.ఈ ప్రత్యామ్నాలు ఏవీ సులభం కాదు, ఫలితాలు ఎలా ఉంటాయో తెలుసుకోవడం కష్టం. పరిస్థితులు ఇప్పటికీ అనిశ్చితంగానే ఉన్నాయి. స్పష్టంగా కనిపించే వరకు పూర్తి ప్రభావం తెలియదు.

# వీరోచిత పోరాటంలో వీరమరణం పొందిన రోజు

బ్రిటీష్ పరిపాలనాకాలంలో వారి ఆకృత్యాలను అణిచివేసి, దేశాన్ని స్వాతంత్ర్యం దిశగా తీసుకెళ్లిన స్వాతంత్ర్య సమరయోధులతోపాటు వీరవనితలు ఎందరో వున్నారు. ఓవైపు విదేశీ పాలకులతో పోరాడుతూనే.. మరోవైపు ప్రజారంజకంగా పాలించిన మహారాణులు మన దేశంలో జన్మించారు. అలాంటి వారిలో ధీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి ఒకరు. దేశ చరిత్రలోనే తొలిసారిగా మహిళా సైన్యాన్ని తయారుచేసిన ఘటన ఆమెది. ఈమె జీవించింది కేవలం 23 సంవత్సరాలే అయినప్పటికీ.. ఆమె అందించిన స్ఫూర్తి నేటికీ యువతలో ఉత్తేజాన్ని నింపుతోంది. ఝాన్సీ లక్ష్మీబాయి' అసలు పేర మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరము నవంబరు నెల19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమీ నాడు జన్మించింది. డీ.బీ పరాస్నిస్ అనే చరిత్రకారుడు రాణీ నవంబర్ 19, 1835 వసంవత్సరంలో జన్మించినట్లు ఆమె జీవిత చరిత్రలో పేర్కొన్నాడు. కానీ దీనికి వేరే చారిత్రక ఆధారాలు లేకపోవడం వలన 1828 అన్ని చోట్లా ఆమోదింపబడుతున్నది. దీనికి ఆధారం 1854లో జాన్ లాంగ్ అనే ఆంగ్లేయుడు రాణిని కలవడానికి వెళ్ళినపుడు ఆమె తరుపు గుమస్తా ఆయనకు రాణీ 26 ఏళ్ళ స్త్రీ అని చెప్పడం జరిగింది. ఈమె తల్లిదండ్రులు మోరోపంత్ తాంబే మరియు భాగీరథీబాయి లు. వీళ్ళది సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబం. ఆమె తల్లి చాలా తెలివైనది మరియు ఆధ్యాత్మిక దోరణి మెండుగా కలది. ఈమె పేరు మణికర్ణిక కాగా ఆమె ను ముద్దుగా మను అని పిలుచుకునేవారు. ఆమె తల్లి రాణి నాలుగేళ్ళ ప్రాయంలో ఉండగానే కన్ను మూసింది. దాంతో ఆమెను పెంచాల్సిన బాధ్యత తండ్రి మీద పడింది. బాల్యంలోనే గుర్రపు స్వారీ, కత్తిసాముల్లో ఆరితేరింది. ఈమెకు 13 ఏళ్ళ వయసులోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. ఆ పెళ్ళి తర్వాత ఈమె జీవితం పూర్తిగా మలుపు తిరిగింది. ఈమె 17వ ఏటలో వున్నప్పుడు 1851లో ఓ కుమారునికి జన్మనివ్వగా.. నాలుగు నెలల వయసులోనే ఆ బాలుడు మరణించాడు. దీంతో లక్ష్మీబాయి దంపతులు 'దామోదరరావు' అనే అబ్బాయిని దత్తత తీసుకున్నారు. ఆ దత్తతను ఆమోదించా ల్సిందిగా బ్రిటీష్ వారికి వారు అర్జీ కూడా పెట్టుకున్నారు.



అంతా సవ్యంగా సాగుతుందనుకున్న తరుణంలో 1953నవంబర్ 21 లో గంగాధరరావు మరణించాడు. దీంతో రాజ్యపాలన మొత్తం లక్ష్మీబాయి మీదే పడింది. ఆ తర్వాత లక్ష్మీబాయికి కష్టాలు మరిన్ని ఎక్కువయ్యాయి. ఆనాటి బ్రిటీష్ గవర్నర్ అయిన డల్హౌసి... లక్ష్మీబాయి భర్త గంగాధర మరణించడంతో దామోదరరావును దత్తత తీసుకోవడం చెల్లదని, రాజ్యాన్ని బ్రిటీష్ వారికి స్వాధీనం చేసి వెళ్లాలని ఆమెని ఆదేశించాడు. అందుకు ఆమె ఏమాత్రం ఒప్పుకోలేదు. దీంతో బ్రిటీష్ వారు తమదైన పన్నాగాలు పన్ని, ఝాన్సీ రాజ్యంపైకి సరిహద్దు రాజ్యపాలకులను రెచ్చగొట్టింది. ఈ విషయాన్ని పసిగట్టిన లక్ష్మీబాయి.. తన రాజ్య సంరక్షణ కోసం నడుం బిగించి పెద్దఎత్తున సైన్యాన్ని తయారుచేసింది. ఇందులో భాగంగానే మహిళలకు సైతం శిక్షణనిచ్చి వారిని సైన్యంలో చేర్చుకుంది. ఈ సమయంలోనే ఆమె భారత స్వాతంత్ర్యంపై చైతన్యం కల్పించింది. ఈ క్రమంలోనే ఆమె సిపాయి ఉద్యమంలో పాలుపంచుకుంటున్న నానాసాహెబ్, రావుసాహెబ్, తాంతియా తోపేలతో చేతులు కలిపింది. ఇంతలోనే బ్రిటీష్ సేనలు ఝాన్సీలో ప్రవేశించి ప్రజల్ని నానా ఇబ్బందులకు గురిచేయడం మొదలుపెట్టాయి.

ఝాన్సీకి స్వేచ్ఛ కలిగించి లక్ష్మీబాయి ని స్వతంత్రుపరురాలు చేయటానికి తిరుగుబాటు దార్ల నాయకుడైన తాత్యా తోపే ఆధ్వర్యములో 20,000 మంది సైన్యం పంపబడింది. అప్పుడు బ్రిటిష్ వాళ్ళ దగ్గర 1,540 సిపాయిలు మాత్రమే ఉన్నప్పటికీ.. వీళ్ళు చాలా శిక్షణ పొందినవాళ్ళు కావడంతో అనుభవం లేని తోపే సిపాయిలు పారిపోయారు. లక్ష్మీబాయి బలగాలు బలహీనమవడంతో మూడు రోజుల తరువాత బ్రిటిష్ వాళ్ళు నగర గోడలను చీల్చుకొని నగరాన్ని ఆక్రమించుకోగలిగాయి. ఆమె తన రక్షకులు చుట్టూ ఉండడంతో ఆ రాత్రి గోడ దూకి నగరం నుంచి పారిపోగలిగింది. బ్రిటిష్ సైన్యం క్రమంగా ఝాన్సీని ముట్టడించడం ప్రారంభించింది. రెండు వారాల పోరాటం తర్వాత ఆంగ్లేయులు నగరాన్ని చేజిక్కించుకోగలిగారు. కానీ రాణి మాత్రం మగ వేషంలో దత్తత తీసుకున్న చిన్న బిడ్డను వీపున తగిలించుకుని వారి కన్నుగప్పి పారిపోయింది. కల్పి అనే ప్రదేశానికి చేరుకుని తాంతియా తోపే అనే విప్లవ కారుణ్ణి కలుసుకోగలిగింది.

తాత్యా తోపే ఉండే తిరుగుబాటు దారులతో చేరింది. రాణి, తాత్యా తోపే గ్వాలియర్ కు వెళ్లి తమ తిరుగుబాటు బలగాలను ఒకటి చేసి గ్వాలియర్ మహారాజ సైన్యాన్ని ఓడించి తమ బలగాలతో వాళ్ళను పూర్తిగా నశించి పోయేలా చేసారు. తరువాత వాళ్ళు కపటోపాయముతో గ్వాలియర్ కోటను ఆక్రమించుకొన్నారు. కాని.. 1858 జూన్ 17వ తేదీన రెండో రోజు యుద్ధంలో రాణి మరణించింది. ఆమె బుల్లెట్ గాయాలు తగిలి మరణించిందని సమాచారం. ఇలా ఈ విధంగా రెండు వారాలపాటు విదేశీ సైన్యంతో వీరోచితంగా పోరాడి, వీరమరణం పొందింది.

# చిత్రపతి శివాజీ బొమ్మల సేన

బొమ్మలు నిర్భయ ప్రకాశికలు. తెగువకి, ఎదురీతకి, నిలదీతకి నిజదర్శనాలు. ఒంటి రేఖాచిత్రమైనా సరే... కోటి సిపాయిల బలగాన్ని మించిన శక్తివంతం. ఒక వ్యంగ్యచిత్రం లక్ష అక్షరాలలో పొదిగిన భావానికంటే కూడా మహా మిన్న. వందశాతం గురి తప్పని బాలిస్టిక్ క్షిపణితో సమానం. ఇవి అతి శయోక్తులు కావు. క్రూర నియంతలను, కర్కోటక చక్రవర్తులను వేలెత్తి చూపి వెక్కిరించిన కార్టూనిస్టులు, చిత్రకారుల జీవిత కథలు కోకొల్లలు. ఏ ప్రజా కళకైనా ఉండేది అంతటి పదునే. అందుకే పాలకులకు అవంటే అస్సలు గిట్టదు. పైకి వినిపించకపోవచ్చును గానీ బొమ్మలు మనతో సంభాషిస్తాయి. మనలోని ఖాళీలను ప్రేమతనంతో నింపుతాయి. శైశవ గీతాలకి కోరస్ ఇస్తాయి. మనసుకి గాయమైతే మందు పూస్తాయి. నిస్పృహ పుటని మూసేసి ఆశల మీటని సుతారంగా తడతాయి. ఈ ఊరడింపే కళా ప్రయోజనానికి సూచిక. ఈ వరుసలో ఇప్పుడు తలుచుకోవలసిన ముఖ్యులు తల్లావజుల శివాజీ. ఆయన సీనియర్ పాత్రికేయుడు, చిత్రకారుడు, రచయిత, కళా విమర్శకుడు. ఆయన రాతలో, గీతలో హాస్యమూ, సున్నితత్వమూ సమతూకంలో ఒదిగిపోతాయి. విషయం ఎంత గాఢమైనదైనా ఇట్టే జీర్ణమైపోవడం ఆయన చిత్రాల స్వభావం. ఒకానొక కాలంలో ఆర్టిస్ట్ రాజుతో కలిసి ఆయన సృష్టించిన 'లింగా ది గ్రేట్' కార్టూన్ కదంబం సూపర్ డూపర్ హిట్. అంతకంటే ముందే 'ఆ నీలి నగరిలో' పేరుతో శివాజీ ఒక నవలిక రాశారు. నగరానికి వచ్చిన ఒక బాలుడి జీవితంలో జరిగే సంఘటనలే ఇందులో కథాంశం. పిల్లల కోసమే శివాజీ ఎక్కువ ఆలోచిస్తారనడానికి ఇది మరొక దాఖలా. ప్రస్తుత ప్రస్తావనకి హేతువు కూడా ఇక్కడే ఉంది. గాజాలో గత కొన్ని నెలలుగా సాగుతున్న భీకర దాడుల్లో అసంఖ్యాకంగా పిల్లలు మరణించారు, మరణిస్తున్నారు. గాయపడ్డ చిన్నారుల సంఖ్య అంతకు అనేక రెట్లు అధికం. తప్పొప్పుల లెక్కలను అలా ఉంచితే, ఏ యుద్ధంలో అయినా అతిగా ఛిద్రమయ్యేది పిల్లలు, స్త్రీలు, వృద్ధుల జీవితాలే. గాజాలో ఇజ్రాయిల్ దళాల దాడుల్లో సాగుతున్న శిశువధ పట్ల ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయిల్ పౌరసమాజం కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న సందర్భాలున్నాయి. ఎక్కడికక్కడ కవులు, రచయితలు, గాయకులు, కళాకారులు, చిత్రకారులు సహా వివిధ శ్రేణులవారు రకరకాల రూపాల్లో నిరసనలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తల్లావజుల శివాజీ డజను వరకు చిత్రాలు వేశారు. 'ఓ.. నౌ వెకేట్ గాజా లిటిల్ డియర్', 'ప్లాంట్ హోప్ ఏ గాజా', 'ఐ లవ్ వార్ ఎనీవేర్', 'లెట్ దేర్ బి హోప్.. గాజా', 'వెయిట్ యు విల్ హావ్ సమ్ మోర్.. గాజా' వంటి క్యాప్షన్స్‌తో శివాజీ వేసిన ఈ చిత్రాలు కార్టూన్ శైలిలో ఉన్నప్పటికీ, వ్యంగ్యం కంటే విషాదస్పర్శే మనసుని తాకుతుంది. జెరూసలెంలోని హిబ్రూ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు డేవిడ్ షుల్మన్ ఇండియన్ స్టడీస్‌లో తులనాత్మక మత అధ్యయనం విభాగంలో ప్రొఫెసర్‌గా దీర్ఘకాలం పనిచేశారు. ఆయన కవి, చరిత్రకారుడు, ఇండాలజిస్ట్ కూడా.



దక్షిణ భారత మత చరిత్ర, భారత రాజకీయాలు, ద్రవిడ భాషాశాస్త్రం, కర్ణాటక సంగీతం వంటి అంశాలలోనూ ఆయన నిష్ణాతులు. తమిళ, తెలుగు, హిందీ, సంస్కృత భాషల్లో పట్టున్న విద్యాధికుడు, -పీస్ యాక్టివిస్ట్ కూడా. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ఆ దేశ పౌరసమాజంతో కలిసి అనేక నిరసన ప్రదర్శనలు నిర్వహించారాయన. శివాజీ సోదరులు తల్లావజుల పతంజలిశాస్త్రికి షుల్మన్‌తో స్నేహ సంబంధాలు ఉండటంతో శివాజీ వేసిన చిత్రాలను షుల్మన్‌కి పంపించారు పతంజలిశాస్త్రి. వాటిని చూసిన షుల్మన్ ఎంతో ఆసక్తి కనబరిచి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇజ్రాయిల్ పాలకుల వైఖరిని నిరసించే అక్కడి పౌరసమాజ ప్రముఖుడి ప్రశంసలందుకున్న చిత్రాలు ఈ శివాజీ బొమ్మలు. గాజాపై సాగుతున్న దాడిని వ్యతిరేకిస్తూ నేడు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని లా మకాన్‌లో 'హైదరాబాద్ ఫర్ ద చిల్డ్రన్ ఆఫ్ గాజా' పేరుతో ఒక కార్యక్రమం జరుగుతున్నది. ఇందులో కవి గాయకులు, చిత్రకారులు, కళాకారులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొంటున్నారు. ఈ తరుణంలో శివాజీపై గౌరవంతో ఆయన చిత్రాలను పోస్టర్లుగా తీర్చి ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. యుద్ధ వ్యతిరేక చిత్రకారుడు, చిన్నారుల శ్రేయోభిలాషి శివాజీకి అభినందనలు.

అగ్నిధార

## మక్తమాదారంలో సొంత డబ్బులతో శ్రీనివాస్ గౌడ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

ప్రారంభించిన మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కడ్తాల్ మండలంలోని మక్తమాదారం గ్రామంలో సొంత డబ్బులతో 100 మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల శ్రీకారం చుట్టిన గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ను కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ అభినందించారు. తన సొంత డబ్బులతో గ్రామానికి చేస్తున్న సేవలను కొని ఆడారు. ఈ సందర్భంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను తన చేతుల మీదుగా ప్రారంభించారు. కోట్ల ఆస్తి ఉన్న గ్రామం కోసం రూపాయ ఖర్చు పెట్టని వారు ఎందరో ఉన్నారని తనకు ఉన్నదాంట్లో గ్రామాన్ని అభివృద్ధి చేయడం కోసం తన కొంత సేవలు అందిస్తున్న శ్రీనివాస్ గౌడ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, రవీందర్ రెడ్డి ,మాజీ ఎంపీటీసీ మంజుల, చంద్రమౌళి మాజీ ఉపసర్పంచ్ గణేష్, వార్డు సభ్యులు మహేందర్ గౌడ్, జనీల్ కుమార్ యాదగిరి గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు కృష్ణయ్య, చందు మల్లేష్, సాయిలు నరేష్, జంగయ్య, రాజేందర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శంగా నిలిచిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అవ్వారీ శ్రీనివాసులు తన కుమారుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మార్చాల లో ఏడవ తరగతిలో చేర్పించడం జరిగింది. నేటి పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదని ప్రభుత్వం అన్ని విధాల పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నదని ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకాన్ని కల్పించడానికి తన యొక్క కుమారుని మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించడం జరిగిందని ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి సి హెచ్ వెంకట రమణ మాట్లాడుతూ తన కుమారుని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారని ప్రతి ఒక్కరూ ఆ దిశగా ఆలోచించి ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీలత శ్రీనివాసులు సి నారాయణ,యాదయ్య,గోపాల్,పాండు,శ్యామలాదేవి పాల్గొన్నారు.

## మహమ్మదాబాద్ గొర్రె కాపరుల సంఘం అధ్యక్షుడిగా కొనగంటి పల్లి శీనయ్య



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్** మహమ్మదాబాద్ గొర్రె కాపరుల సంఘం అధ్యక్షుడిగా కొనగంటి పల్లి శ్రీనయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలోని బీరప్ప ఆలయంలో గొర్రె కాపరుల సంఘానికి ఎన్నికల అధికారులు లావణ్య, నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా కురువ బీరయ్య, కార్యదర్శిగా బేడీ గోపాల్, డైరెక్టర్లుగా కావటి రాజు, కురువ చిన్న అంజమ్మ, పసుపుల దేవమ్మ, కొనగంటి పల్లి కృష్ణయ్య ఎన్నికైనట్లు అధికారులు పేర్కొన్నారు. సంఘం బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తామని అధ్యక్ష, కార్యదర్శులు శీనయ్య, గోపాల్ తెలిపారు. కార్యక్రమంలో గొర్రె కాపరుల సంఘం సభ్యులు కురువ కృష్ణ పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు తప్పక పాటించాలి

పుస్తకాలు,దుస్తులు అమ్మొద్దు డీఈవో ఎండి అబ్దుల్ ఘని



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కచ్చితమైన నిబంధనలను పాటించాలని జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని అన్నారు. పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు ఇతర స్టేషనరీ, యూనిఫాం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ పేరుతో ప్రభుత్వ అనుమతి పొందారో అదే పేరుతో పాఠశాల నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనల ప్రకారం ఫీజులు వసూలు చేయాలని, విద్యా సంవత్సరం ముందుగానే పాఠశాలలు తరగతుల వారిగా ఫీజు పట్టుకులర్స్ వారి పాఠశాలలో డిస్ప్లే లో ఉంచాలని ఆయన అన్నారు.

## బహిరంగ సభ విజయవంతం చేయాలి

పెద్దపల్లి జిల్లా టీవీఏసి జేఏసీ చైర్మన్
మల్ల కిషన్ రెడ్డి, కన్వీనర్ మట్ట రాజు



**అగ్ని ధార న్యూస్,( పెద్దపల్లి):** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ సమస్య సాధన కొరకు ఈనెల 18న జరుగనున్న చలో హైదరాబాద్ బహిరంగ సభకు పెద్దపల్లి జిల్లాలోని ఆర్టిజన్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టివిఏసి జెఏసి పెద్దపల్లి జిల్లా చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతలు బట్టి కన్వర్షన్ చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం, యాజమాన్యం పట్టించుకోకపోవడం వల్ల ఆర్టిజన్ కార్మికులు కుటుంబసభ్యులతో కలిసి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న 20వేల మంది ఆర్టిజన్ కార్మికులు కుటుంబాలతో తరలిరావాలని ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## గట్టిపడపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రోసిడింగ్ లు అందజేత

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి




**అగ్ని ధార న్యూస్ ( కల్వకుర్తి)**తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి భూమి పూజ చేసి ప్రోసిడింగ్ అందించిన తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన లబ్ధిదారులకు ఎంపిక చేయడం జరిగింది అని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరిగిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు విష్ణు గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రకంటి శివకుమార్ గౌడ్, మరియు ప్రధాన కార్యదర్శి సభవాట్ రాజేందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రేణు రెడ్డి, డేవిడ్, తిరుపతి రెడ్డి, మంచేందర్, మట్ట అంజయ్య వెంకటయ్య, చిత్తరాంజన్, రాజురెడ్డి, రాజశేఖర్, పవన్మరియు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేత

ట్రస్టు ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మొగుళ్ల లక్ష్మమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయం స్థానిక బిఆర్ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ వెంటనే స్పందించిన బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ తమ ట్రస్టు ద్వారా తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి 10.000 రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య, గోపాల్ నాయక్ ,సింగల విండో డైరెక్టర్ కటికల శేఖర్ యాదవ్, రమేష్, సత్యనారాయణ, గణేష్ కుమార్ ,నరసింహ శీను తదితరులు వివిధ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం

ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలంలోని గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని వెల్దండ మండలం బైరాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు అందుబాటులో ఉంచాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ జయప్రకాష్, జంగయ్య యాదవ్,రషీద్, పుల్లయ్య, హరికిషన్, జర్పుల శ్రీను, రాజు యాదవ్, వైద్యులు పాల్గొన్నారు.

## భూ భారతితోనే రైతుల భూ సమస్యలు శాశ్వత పరిష్కారం.

ముత్తారం మండల తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి.



**ముత్తారం అగ్నిదార న్యూస్** ముత్తారం మండలంలోని రైతుల భూసమస్యలు భూ భారతి తో పరిష్కారం అవుతాయని సోమవారం రోజున మండలం లోని కేషనపల్లి,సీతంపేట గ్రామములలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి ముత్తారం మండల తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి అన్నారు ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి 2025 ఆర్ఓఆర్ చట్టం రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో రైతులు తమ సమస్యలను రాత పూర్వకంగా అధికారులకు పిర్యాదు చేయాలని తహశీల్దార్ రైతులకు సూచించారు. రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, ఫిర్యాదులను పరిష్కరించడానికి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ ఆర్ఐ శ్రీధర్ ,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి ఘనంగా సన్మానం



**అగ్నిధారన్యూస్ ఖమ్మం** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపర మేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సన్మానం జరిగింది. ఈ సన్మానం గ్రామ పెద్దలు అఫ్జల్ మరియు గోపాల్ రెడ్డి చేతుల మీదుగా జరిగింది. డాక్టర్ దివ్యమూర్తి ప్రతిభను గుర్తించి ఈ సన్మానం చేసిన గ్రామ పెద్దలు తెలియజేశారు. ఈ సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని డాక్టర్ దివ్య మూర్తి తెలియజేశారు. ఇప్పటివరకు తనకు 113 చోట్ల సన్మానం జరిగిందని తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాధిక, వెంకటేశ్వర్లు, మంజుల, కల్పన, జ్యోతి, పురుషోత్తం మరియు ఇతర పెద్దలు సూరేపల్లి జ్ఞానరత్నం, కట్టెకోల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆర్జీవన్ కార్మికుల సమస్యల పై సమీక్ష



**అగ్ని ధార న్యూస్, (రామగుండం):** సింగరేణి లోని వివిధ గనులలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం ఆర్జీవన్ జిఎం కార్యాలయంలో పర్సనల్ డిపార్ట్ మెంట్ కు సంబంధించిన పలు విషయాల పై సంక్షేమాదికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్జి1లోని గనులు డిపార్ట్ మెంట్స్ లలో పని చేస్తూ గైర్హాజర్ ఉద్యోగుల,సిఎంపిఎఫ్ నామినేషన్లు పెండిగ్,కారుణ్య నియామక ఉద్యోగాలు,టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులపై తదితర అంశాలపై అన్ని గనుల సంక్షేమాదికారులతో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్జి1 ఏరియాలోని కార్మికులకు సంబంధించిన పలు అంశాల పై చర్చించారు. పదవి విరమణ పొందిన ఉద్యోగుల టర్మినల్ బెన్ ఫిట్స్ చెల్లింపు, పెన్షన్ సంబంధిత సమస్యలు,ట్రాన్స్ ఫర్,విధులకు గైర్హాహాజరు అవుతున్న కార్మికులకు సంబంధించిన కౌన్సిలింగ్ వివరాలు హాజరు శాతం పెంచుటకు చేపట్టవలసిన ప్రణాళికలు,సిఎంపిఎఫ్ నామినేషన్స్ కారుణ్య నియమకాలు,క్వార్టర్ అలాట్ మెంట్,కోర్ట్ కేసుల వివరాలు,బదిలీలు,ఇతర పర్సనల్ డిపార్ట్ మెంట్ కు సంబంధించిన,ఉద్యోగుల సంక్షేమ సదుపాయాలు,బెన్ ఫిట్స్ పై చర్చించారు. ఈ సమావేశంలో సీనియర్ పిఓ శ్రావణ్ కుమార్,హనుమంత రావు,సంక్షేమ అధికారులు రవీంధర్,గణేశ్,నాగరాజు,సాయి,డిప్యూటి సూపరిండెంట్ వూట్ల దేవా చారి పాల్గొన్నారు.

## పక్షవాతం తో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి

నిత్యావసర వస్తువులు , నగదు అందజేసిన సూపర్ బజారు సిబ్బంది.



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** గోదావరిఖని సింగరేణి సూపర్ బజార్లో పనిచేస్తున్నటువంటి తోటి కార్మికుడు మరియు ప్రజా కళాకారుడు సంబోదు కొమురయ్య గత రెండు నెలల నుంచి పక్షవాతం తో బాధపడుతున్న నేపథ్యంలో సోమవారం సింగరేణి సూపర్ బజారు సిబ్బంది కలిసి జనగామ లోని కొంరయ్య ఇంటికి వెళ్ళి నిత్యావసర సామాన్లు, తోటి సిబ్బంది దగ్గర వసూలు చేసిన డబ్బులను కొంరయ్య కుటుంబానికి అందజేయడం జరిగిందని సింగరేణి సూపర్ బజారు ఇంచార్జీ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో తోటి సిబ్బంది వెంకన్న, రాజయ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద ఆర్యవైశ్యుల గృహ నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూత





ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి పట్టణంలోని ఇద్దరు నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రెండు కుటుంబాలకు ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్మిక సంఘం అధ్యక్షులు సూర్యప్రకాష్ రావు, పట్టణ అధ్యక్షుడు బావండ్ల మధు,మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం, తెలంగాణ జాగృతి అధ్యక్షుడు దారమోని గణేష్, భగత్ సింగ్, కనుక సత్యం అల్లుడు కృష్ణ.కల్వకుర్తి ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు గంధం కిరణ్ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు వాస శేఖర్, ప్రధాన కార్యదర్శి సంబు ముత్యాలు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి పూరి రమేష్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండూరు కృష్ణయ్య, యువజన సంఘం అధ్యక్షుడు సంబు తరుణ్, కోశాధికారి గుండ్ల రేవంత్, సంఘం నాయకులు గందె రవి, బచ్చు మురళి,రాము కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపార విస్తరణ ప్రాజెక్టుల్లో మరింత వేగం పెంచాలి

జాప్యం చేస్తే ఉపేక్షించేది లేదు
సింగరేణి చైర్మన్ అండ్
మేనేజింగ్ డైరెక్టర్ బలరాం




**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :**వ్యాపార విస్తరణ ప్రాజెక్టుల్లో మరింత వేగం పెంచాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఆదేశించారు.సోలార్,పవన,జియో థర్మల్ విద్యుత్తు, బొగ్గు నుంచి కెమికల్స్ పై ప్రత్యేక సమీక్షపనులు మందకొడిగా సాగితే ఉపేక్షించేది లేదని అన్ని విభాగాల అధిపతులను హెచ్చరించారు.28 రకాల విస్తరణ ప్రతిపాదనలపై సుదీర్ఘంగా సమీక్షించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.సింగరే వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన సోలార్ విద్యుత్,పవన విద్యుత్,బ్యాటరీ స్టోరేజ్,జియో థర్మల్ విద్యుత్,గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్,కీలక ఖనిజాల ఉత్పత్తి,జాయింట్ వెంచర్ల ఏర్పాటు,కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ తయారీ,సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్,భూగర్భ గనుల్లో కోల్ గ్యాసిఫికేషన్ తదితర 28 రకాల ప్రాజెక్టులు,వాటి పనులపై ఆయన సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.కొన్ని ప్రాజెక్టులపై ఇప్పటికే ప్రాథమిక అవగాహనకు రావడం,కొన్ని పనుల పట్ల ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందని,మరికొన్ని పనులపై ఏజెన్సీల ద్వారా అధ్యయనం జరుగుతుందని,సింగరేణి సంస్థకు ఈ వ్యాపార విస్తరణ చర్యలు ఎంతో అవసరమని,ఈ పనులను మరింత వేగవంతంగా నిర్వహించాలని కోరారు.వివిధ విభాగాల వారు తమకు కేటాయించిన పనులపై వివరించగా ఆయన పనులలో జరుగుతున్న జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు.మరో 10 రోజులకల్లా ప్రతీ పనిలో ప్రగతి కనిపించాలని సూచించారు.ఇకపై ప్రతీ వారం బొగ్గు ఉత్పత్తిపైనే కాకుండా ప్రత్యేకంగా వ్యాపార విస్తరణ ప్రాజెక్టులపై సమీక్ష ఉంటుందని స్పష్టంచేశారు.సింగరేణి యాజమాన్యం,రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు కూడా సింగరేణి వ్యాపార విస్తరణ చర్యల పట్ల సానుకూల ధోరణితో ఉన్నాయని,ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వ్యాపార విస్తరణ చర్యలు త్వరగా అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు కార్యాలయాలు,క్వార్టర్ల పై చేపట్టాల్సిన రూఫ్ టాప్ సోలార్ పవర్,కోల్ వాషరీల ఏర్పాటు,హైడ్రాలిక్ కన్వేయర్ల ఏర్పాటు వంటి విషయాలపై చర్చించారు. సమావేశంలో డైరెక్టర్ ఈ అండ్ ఎం డి.సత్యనారాయణ రావు డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ,డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు,డైరెక్టర్ పర్సనల్ గౌతమ్ పొట్రు,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని,జీఎం సి.పి.పి ఎ.మనోహర్,జీఎం మార్కెటింగ్ ఎన్.వి.రాజశేఖర్ రావు, సింగరేణి థర్మల్ పవర్,సోలార్ పవర్,రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్,సింగరేణి సివిల్,బిజినెస్ డెవలప్ మెంట్,తదితర 20 శాఖల జనరల్ మేనేజర్లు కూడా పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ సహకారం



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనా తీరు, కేబినెట్ సమావేశాల నిర్వహణ, ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆయన వెల్లడించిన వివరాలు తీవ్ర చర్చకు దారి తీశాయి. తన పార్టీ నిబద్ధతను, రాజకీయ ప్రత్యర్థులపై తన వైఖరిని స్పష్టం చేస్తూ.. మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్ చాట్‌లో ఈటల కీలక వ్యాఖ్యలు చేశారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పాలనా విధానం ఎలా ఉండేదో ఈటల రాజేందర్ తన అనుభవాలను పంచుకున్నారు. 'కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి పదిహేను రోజులకొకసారి తప్పనిసరిగా కేబినెట్ సమావేశం జరిగేది. మంత్రులుగా మేము తీసుకున్న చిన్నపాటి నిర్ణయాలను కూడా కేబినెట్ ముందు ఉంచండి, కేబినెట్ అనుమతి తీసుకోండి అని ఆయన మాకు పదేపదే సూచించేవారు' అని ఈటల గుర్తు చేసుకున్నారు. ఇది గత ప్రభుత్వంలో పాలనా వ్యవహారాల్లో పారదర్శకత, సమిష్టి నిర్ణయాలకు ప్రాధాన్యత ఇచ్చేవారనడానికి నిదర్శనంగా ఆయన చూపారు.కాళేశ్వరం ప్రాజెక్టు వంటి భారీ ప్రాజెక్టుల విషయంలోనూ ఇదే విధానం ఉండేదని ఈటల స్పష్టం చేశారు. 'కాళేశ్వరం మీద కూడా ప్రతీ చిన్న విషయాన్ని కేబినెట్లో కూలంకుషంగా చర్చించాము' అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టుపై కొనసాగుతున్న విచారణ, ప్రభుత్వాల మధ్య విమర్శల నేపథ్యంలో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కాళేశ్వరం అంశంపై తాను, కేసీఆర్, హరీష్ రావులు విచారణ కమిషన్ ముందు ఒకే మాట చెప్పామనడం సరికాదని, నాటి నిర్ణయాలు సమిష్టిగా తీసుకున్నవేనని ఈటల వివరించారు. కుంగిన పిల్లర్లను బాగు చేయించకుండా రైతుల నోట్లో మట్టి కొట్టవద్దని, మేడిగడ్డ బ్యారేజీని తక్షణమే పునరుద్ధరించి, రైతులకు భరోసా కల్పించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈటల రాజేందర్ తన రాజకీయ వైఖరిని స్పష్టం చేస్తూ.. కేసీఆర్‌ను రాజకీయ ప్రత్యర్థిగానే చూస్తానని పునరుద్ఘాటించారు. 'భూలోకంలో నాకు నరకాన్ని చూపిన వ్యక్తి కేసీఆర్' అని బీఆర్ఎస్‌లో తన గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ ఎదురైతే నమస్కారం పెట్టే సంస్కారం తనకు ఉందని, అది తన వ్యక్తిగత గుణమని వివరించారు.తెలంగాణలో బీజేపీ సొంతంగా అధికారంలోకి వచ్చే సత్తా ఉందని.. బీఆర్ఎస్‌తో విలీనం తమకెందుకని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో పేదలను రేవంత్ టచ్ చేశారు.. అదే కాంగ్రెస్ పతనానికి పునాది వేసిందని ఆరోపించారు. 40 ఏళ్ల క్రితం పట్టా ఇచ్చిన ప్రభుత్వమే ఇప్పుడు ఇళ్లను కూల్చేస్తే ఎలా అని ప్రశ్నించారు. మరో 20 ఏళ్లపాటు కాంగ్రెస్‌కి ఓటేసే పరిస్థితి లేదంటూ ఈటల తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, కేంద్రం నుంచి అనేక ప్రాజెక్టులు తెలంగాణకు తీసుకువచ్చామని కిషన్‌రెడ్డి తరచుగా చెబుతుంటారు. టెక్స్‌టైల్ ప్రాజెక్ట్, జహీరాబాద్‌లోని ఇండస్ట్రియల్ పార్క్, పసుపు బోర్డు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటివి బీజేపీ కృషి వల్లనే వచ్చాయని, కాంగ్రెస్ మంత్రులు తమ వల్లనే వచ్చాయని చెప్పుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఈటల మండిపడ్డారు. "మా వల్లనే వచ్చాయని చెప్పుకుంటున్నవారిని ఈడ్చి కొట్టాలి" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్ మెట్రో నెక్స్ట్ ఫేజ్‌కు కేంద్రం సహకారం అందిస్తుందని కూడా ఆయన స్పష్టం చేశారు. ఈటల రాజేందర్ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్రమైన వాదోపవాదాలకు అద్దం పడుతున్నాయి.

# గాంధీ ఆసుపత్రి ని సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**సికింద్రాబాద్ :** గాంధీ ఆసుపత్రిలో ఇటీవల నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆసుపతిని సందర్శించారు. గత నెల రోజులుగా కరోనా కేసులు దేశవ్యాప్తంగా విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రధాని మోడీ ఆదేశాల మేరకు తెలంగాణలోని నోడల్ కేంద్రంగా ఉన్న గాంధీ ఆసుపత్రిని పరిశీలించారు. కరోనా సమయంలో గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంటును పరిశీలించారు. అనంతరం గాంధీ ఆసుపత్రిలోని కొన్ని విభా గాలలో పెరుగుతూ రోగుల సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. గాంధీ ఆస్పత్రి వైద్య యంత్రాంగం నుండి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సూపరిండెంట్ రాజకుమారితో గాంధీ ఆసుపత్రిలో ఉన్న మౌలిక సదుపాయాలు రోగులకు అందుతున్న వైద్య చికిత్సల గురించి చర్చించారు. ఇటీవల గాంధీ ఆసుపత్రిలో తాగునీటి సరఫరా సరిగా లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో రోగులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూపర్డెంట్ కు సూచించారు. పారిశుద్ధ్యం, డ్రైనేజీ నిర్వహణ లోపం లేకుండా సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిటీ స్కాన్, ఎమ్మారై యంత్రాలు పనిచేసే విధంగా చూడాలని రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత ఉందని సూపరిండెంట్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకురాగా ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తానని స్పష్టం చేశారు.ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు గాంధీ ఆసుపత్రి వైద్య సిబ్బంది యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## ఆపరేషన్ కగార్ ను ఆపి శాంతి చర్చలు జరపాలి- రమేష్




**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** కేంద్ర ప్రభుత్వం దండకారణ్యంలో ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న మారణ హోమాన్ని ఆపి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. అడవుల్లో కాల్పులను విరమించి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని రేపు హైదరాబాద్ ఇందిరా పార్క్ లో నిర్వహించనున్న మహా ధర్నా గోడపత్రికలను విడుదల చేశారు. మాట్లాడుతూ.. అడవుల్లోని ఖనిజ సంపదను, వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టి అందుకు అడవుల్లో ఉన్న మావోయిస్టులను ఆదివాసీలు గిరిజనులను తరిమి వేసేందుకే కేంద్రం ఆపరేషన్ కగారును చేపట్టిందన్నారు. దీనికి వ్యతిరేకంగా రేపు ఇందిరా పార్క్ లో శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా జరుగుతోందని అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పృథ్వీ నాదం, నేతలు శిరీష, జ్యోతి,తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో అంతర్జాతీయ యోగ డే కార్యక్రమాలు..

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం జూన్ 16** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా.. సింగరేణిలో అంతర్జాతీయ యోగ డే కార్యక్రమాలను తేదీ:16 జూన్ 2025 నుండి,21జూన్ 2025 వరకు మందమర్రి ఏరియా లోని గనులలో,డిపార్ట్మెంట్లలో,జనరల్ మేనేజర్ కార్యాలయంలో యోగ కార్యక్రమాలను నిర్వహించినారు. అలాగే మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి. దేవేందర్ యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ ముందస్తుగా అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు ఉద్యోగులకు, అధికారులకు, నాయకులకు తెలియజేశారు. అందరు కూడా ప్రతి రోజూ ఒక గంట సమయాన్ని కేటాయించి యోగ చేసినట్లయితే మీ ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది. ప్రస్తుత కాలంలో ఆరోగ్యంగా ఉంటేనే ఇమ్యూనిటీ పెరగడంతోపాటు, ఇన్ఫెక్షన్స్ కూడా రాకుండా ఆరోగ్యంగా ఉంటామన్నారు. కనుక ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సింగరేణి సంస్థ మూడుపువ్వులు, ఆరుకాయలుగా ఉత్పత్తి ఉత్పాదకత,రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో.. పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, ఏఐటీయూసీ స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సీ.వీ.రమన డీజీఎం,సివిల్ రాము,ఐ ఈ డీ,ఎస్ ఈ (ఐ ఈ) కే.కిరణ్ కుమార్,డి వై పి ఎం ఆసిఫ్, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి,ఐటి, డీ వై మేనేజర్ రవి మరియు జి ఎం ఆఫీస్ ధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాపార విస్తరణ ప్రాజెక్టుల్లో మరింత వేగం పెరగాలి..

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం జూన్ 16** సోలార్,పవన,జియో థర్మల్ విద్యుత్తు, బొగ్గు నుంచి కెమికల్స్ పై ప్రత్యేక సమీక్ష పనులు మందకొడిగా సాగితే ఉపేక్షించేది లేదు. అన్ని విభాగాల అధిపతులకు సీఎండీ ఎన్.బలరామ్ హెచ్చరిక. 28 రకాల విస్తరణ ప్రతిపాదనలపై సుదీర్ఘంగా సమీక్షించిన ఛైర్మన్ సింగరేణి భవన్,జూన్ 16,2025 సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులను, పనులను మరింత వేగవంతంగా నిర్వహించాలని, మందకొడిగా పనులు కొనసాగితే ఉపేక్షించేది లేదని సీఎండీ ఎన్.బలరామ్ వివిధ విభాగాల అధికారులను హెచ్చరించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో సమావేశంలో సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన సోలార్ విద్యుత్,పవన విద్యుత్,బ్యాటరీ స్టోరేజ్,జియో థర్మల్ విద్యుత్,గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్,కీలక ఖనిజాల ఉత్పత్తి, జాయింట్ వెంచర్ల ఏర్పాటు, కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ తయారీ,సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్, భూగర్భ గనుల్లో కోల్ గ్యాసిఫికేషన్ తదితర 28 రకాల ప్రాజెక్టులు, పనులపై ఆయన సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాజెక్టులపై ఇప్పటికే ప్రాథమిక అవగాహనకు రావడం, కొన్ని పనుల పట్ల ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందని,మరికొన్ని పనులపై ఏజెన్సీల ద్వారా అధ్యయనం జరుగుతుందని, సింగరేణి సంస్థకు ఈ వ్యాపార విస్తరణ చర్యలు ఎంతో అవసరం కనుక ఈ పనులను మరింత వేగవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు.వివిధ విభాగాల వారు తమకు కేటాయించిన పనులపై వివరించగా ఆయన పనులలో జరుగుతున్న జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు.మరో 10 రోజులకల్లా ప్రతీ పనిలో ప్రగతి కనిపించాలన్నారు. ఇకపై ప్రతీ వారం బొగ్గు ఉత్పత్తిపైనే కాకుండా ప్రత్యేకంగా వ్యాపార విస్తరణ ప్రాజెక్టులపై సమీక్ష ఉంటుందని స్పష్టంచేశారు.సింగరేణి యాజమాన్యం,రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు కూడా సింగరేణి వ్యాపార విస్తరణ చర్యల పట్ల సానుకూల ధోరణితో ఉన్నాయని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వ్యాపార విస్తరణ చర్యలు త్వరగా అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో.. ఇంకా కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు కార్యాలయాలు, క్వార్టర్ల పైన చేపట్టాల్సినరూఫ్ టాప్ సోలార్ పవర్ గురించి,కోల్ వాషరీల ఏర్పాటు హైడ్రాలిక్ కన్వేయర్ల ఏర్పాటు వంటి విషయాలపై లోతుగా చర్చించారు. సమావేశంలో డైరెక్టర్ ఈ అండ్ ఎం. డి.సత్యనారాయణ రావు,డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ పర్సనల్ గౌతమ్ పొట్రు,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ శ్రీ ఎస్.డి.ఎం సుభాని, ఇంకా జీఎం సి.పి.పి ఎ.మనోహర్,జీఎం మార్కెటింగ్ ఎన్. వి.రాజశేఖర్ రావు, సింగరేణి థర్మల్ పవర్, సోలార్ పవర్, రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్, సింగరేణి సివిల్, బిజినెస్ డెవలప్ మెంట్,తదితర 20 శాఖల జనరల్ మేనేజర్లు కూడా పాల్గొన్నారు.

## హౌసింగ్ సొసైటీ విచారణ అధికారి జి హనుమంత రెడ్డి ని మార్చండి..

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం జూన్ 16** టి ఎన్ జి ఓ అధ్యక్షుడు గడియారం శ్రీ హరి నీ బదిలీ చేయండి.ముల్కల్ల రాజేంద్రప్రసాద్. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బహుజన్ సమాజ్ పార్టీ.మంచిర్యాల జిల్లా టి ఎన్ జి ఓ హౌసింగ్ సొసైటీలో జరుగుతున్న అవకతవకలపై విచారణ అధికారిగా జిల్లా రిజిస్టర్ శాఖలో అధికారిగా, విధులు నిర్వహిస్తున్న జి. హనుమంత రెడ్డిని విచారణ అధికారిగా నియమించడం సరికాదన్నారు,మంచిర్యాల జిల్లాకు చెందిన వారిని కాకుండా వేరే జిల్లాకు చెందిన అధికారిని విచారణ అధికారిగా నియమించాలన్నారు హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో.. విచారణ జరిగితే హౌసింగ్ సొసైటీలో అవకతవకలు జరగలేదని నివేదిక ఇచ్చిన ఆశ్చర్య పోవాల్సిన పనిలేదన్నారు.ప్రస్తుత టి ఎన్ జి ఓ అధ్యక్షుడు నాయక్ తహసిల్దార్ గా,విధులు నిర్వహిస్తున్న గడియారం శ్రీహరిని వేరే జిల్లాలకు బదిలీ చేస్తేనే విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్.ఈ కార్యక్రమంలో.. ఉపాధ్యక్షులు నాగుల కిరణ్ బాబు మంచిర్యాల పట్టణ నాయకులు కుమ్మరి కృష్ణ ,చైతన్య,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ ఏం పి డాక్టర్ నిర్లక్ష్యం తో వైద్యం వికటించి జిమ్ కోచ్ మృతి

**మేడ్చల్ :** బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని రిసాలబజా ర్ కు చెందిన జ్ఞానేశ్వర్ గత కొన్ని రోజులుగా జిమ్ కోచ్ గా పని చేస్తున్నాడు. రాత్రి బిర్యానీ తిన్నావా తర్వాత ఛాతీలో నొప్పి రావడంతో తన సోదరి సహాయంతో స్థానిక క్లినిక్ తీసుకువెళ్లగా, ఇది గ్యాస్ ప్రాబ్లెమ్ అని ఇంజక్షన్ ఇచ్చి పంపించగా, మృతుడు ఇంటికి వెళ్లిన కొద్ది సేపటికే మృతి చెందడంతో, మృతుని కుటుంబ సభ్యులు క్లినిక్ వద్ద ఆందోళన చేపట్టారు.

బిజినెస్

# యువతకు బెస్ట్ పెట్టుబడి మార్గాలు

## జియోకి ఏమైంది? గగ్గోలు పెడుతున్న యూజర్లు





ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ రిలయన్స్ జియో నెట్‌వర్క్ సేవల్లో అంతరాయాలు తలెత్తాయి. ఇంటర్నెట్ కనెక్టివిటీ, మొబైల్ సిగ్నల్, జియో ఫైబర్ సేవలకు సంబంధించిన సమస్యల గురించి వేలాది మంది నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో జియో నెట్‌వర్క్ ద్వారా కాల్స్, ఇంటర్నెట్ సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురైనట్లు అనేక మంది సోషల్ మీడియా వేదికగా నివేదిస్తున్నారు. ఇప్పటివరకు 12,000కు పైగా రిపోర్టులు నమోదయ్యాయని అంతరాయాల ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ తెలిపింది. ఇందులో ఎక్కువ ఫిర్యాదులు మొబైల్ డేటా వైఫల్యాలకు సంబంధించినవే. 32 శాతం మంది యూజర్లు కాల్ సంబంధిత సమస్యలను నివేదించగా, 12 శాతం మంది వినియోగదారులు జియో ఫైబర్ సేవల్లో అంతరాయం కలిగినట్లు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం 1:45 గంటలకు ఈ సమస్య ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఆ సమయానికి దాదాపు 400 మంది వినియోగదారులు జియో సేవలను యాక్సెస్ చేసేటప్పుడు సమస్యలను నివేదించారు. తర్వాత మధ్యాహ్నం 2:15 గంటలకు కేరళ, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి గణనీయమైన సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. వినియోగదారుల ఫిర్యాదులు పెరుగుతున్నప్పటికీ, రిలయన్స్ జియో దీనిపై స్పందించలేదు.

## లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు వారంలో తొలిరోజైన సోమవారం లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు ఒకశాతం వరకు లాభాలను నమోదు చేశాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా మార్కెట్లు రాణించాయి. సెన్సెక్స్ కిత్రం సెషన్‌తో పోలిస్తే 81,034.45 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా మొదలైంది. ఇంట్రాడేలో 81,012.31 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,865.82 పాయింట్ల వరకు పెరిగింది. నిఫ్టీ 227.90 పాయింట్లు లేదా 0.92 శాతం పెరిగి 24,946.50 వద్ద ముగిసింది. దాదాపు 1898 షేర్లు లాభపడగా.. 2,026 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడ్డ వాటిలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఓఎన్‌జీసీ ఉన్నాయి. అయితే టాటా మోటార్స్, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా నష్టపోయాయి. ఐటీ, మెటల్, రియాలిటీ, ఆయిల్, గ్యాస్ ఒక్కొక్కటి ఒకశాతం పెరగడంతో అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.9 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం పెరిగాయి.



పెట్టుబడి విషయానికి వస్తే యువతకు, వయసుపైబడిన వారికి మధ్య ఉన్న తేడా ఇన్వెస?మెంట్లను ముందుగా ప్రారంభించడం. యువతకు దీర్ఘకాలంలో ఇది ఎంతో కలిసొస్తుంది. 40-45 ఏళ్లు దాటిన వారితో సమానంగా యువత ఏదైనా పథకంలో పెట్టుబడి పెట్టి ఒకే సమయంలో ఉపసంహరించుకుంటే కచ్చితంగా యువతకు ఎంతో లాభం చేకూరుతుంది. అయితే ఎలాంటి పథకాల్లో పెట్టుబడి ప్రారంభించాలో స్పష్టత ఉండడంలేదు. యువకులు క్రమశిక్షణతో, ఆర్థిక నిపుణుల సలహాతో మంచి పథకంలో పెట్టుబడి ప్రారంభిస్తే ఆకర్షణీయ రాబడిని అందుకోవచ్చు. మార్కెట్‌లోని కొన్ని పథకాల గురించి తెలుసుకుందాం.

**పొదుపు ఖాతాలు, డిపాజిట్ సర్టిఫికెట్లు (సీడీలు)**

పొదుపు ఖాతా అనేది డబ్బును నిర్వహించేందుకు సరళమైన, అత్యంత రిస్క్ లేని మార్గం. అయితే ఇందులో వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నప్పటికీ ఈ ఖాతాలు సురక్షితమైనవి. మరోవైపు సీడీలు మీ డబ్బును నిర్ణీత కాలానికి (6 నెలలు లేదా ఒక సంవత్సరం) లాక్ చేస్తాయి. అందుకు కొంత అధిక మొత్తంలో రాబడిని అందిస్తాయి.

**స్టాక్ మార్కెట్**

స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టడం ఆకర్షణీయంగా, ఆసక్తికరంగా ఉంటుంది. మంచి కంపెనీని ఎంచుకొని పెట్టుబడి కొనసాగిస్తే కాలక్రమేణా అధిక రాబడిని అందించగలవు. అయితే ఇవి అస్థిరంగా ఉంటాయని గుర్తుంచుకోవాలి. వీటిలో రిస్క్ అధికంగా ఉంటుందని మరిచిపోకూడదు.

**ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్), మ్యూచువల్ ఫండ్స్**

ఈటీఎఫ్‌లు, మ్యూచువల్ ఫండ్ స్టాక్స్‌లో నిర్ణీత షార్ట్‌టర్మ్‌లో ఒడిదొడుకులు ఉన్నప్పటికీ లాంగ్‌టర్మ్‌లో మంచి రాబడిని అందిస్తాయి. అయితే ఇందుకు పెట్టుబడులను కొనసాగించాల్సి ఉంటుంది. ఈటీఎఫ్‌లు(కొన్ని స్టాక్స్ కలిపి ఉన్న ఫండ్) మార్కెట్‌లో నేరుగా లైవ్‌లో ట్రేడవుతాయి. మ్యూచువల్ ఫండ్స్ కూడా సెక్టార్ వారీగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తాయి. వాటిని నిత్యం ఫండ్ మేనేజర్ నిర్వహిస్తుంటారు.

**బాండ్స్**

బాండ్లు అంటే కాలానుగుణ వడ్డీ చెల్లింపుల కోసం కంపెనీలు లేదా ప్రభుత్వాలకు ఇచ్చే రుణాలు. ఇవి స్టాక్స్ కంటే సురక్షితమైనవి. కానీ, తక్కువ రాబడిని అందిస్తాయి.

**రియల్ ఎస్టేట్ (ఆర్‌ఈఐటీ)**

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు (ఆర్‌ఈఐటీలు) యువ పెట్టుబడిదారులను భౌతిక ఆస్తిని కొనుగోలు చేయకుండానే రియల్ ఎస్టేట్ పెట్టుబడుల నుంచి డివిడెండ్ సంపాదించడానికి వీలు కల్పిస్తాయి. వీటిని చాలా బ్రోకరేజీ ఖాతాల ద్వారా కొనుగోలు చేయవచ్చు. ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోను వైవిధ్యపరచడానికి ఇది మంచి మార్గాన్ని అందిస్తుంది.

**విద్య, నైపుణ్యాలు**

విద్య, సర్టిఫికేషన్లు లేదా అధిక ఆదాయాన్ని సమకూర్చే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం (కోడింగ్, డిజైన్ వంటివి) కోసం పెట్టుబడి పెట్టడం అన్నింటికంటే మంచి ఇన్వెస్ట్‌మెంట్. దీన్ని ఎంత త్వరగా ప్రారంభిస్తే కెరియర్‌లో అంత ప్రయోజనం పొందుతారు.

# ఉద్యోగాల కోతకు ఏఐ సాకు!




కృత్రిమమేధకు ఆదరణ పెరుగుతున్న కొద్దీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో గుబులు అధికమవుతోంది. తమ ఉద్యోగాల స్థానంలో ఏఐ పాగా వేస్తుందని చాలామంది జంకుతున్నారు. ఇదే అదనుగా కొన్ని కంపెనీలు కాస్ట్ కటింగ్, పునర్వ్యవస్థీకరణ పేరుతో ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ డెవలపర్ల స్థానాన్ని ఏఐ భర్తీ చేస్తుందని చెబుతూ కొన్ని కంపెనీల వ్యవస్థాపకులు, సీఈఓలు తమ మోడళ్ల అమ్మకాలను పెంచుకోవడానికి ఎక్కువగా ప్రచారం చేస్తున్నట్లు ఏఐ కోడింగ్ ప్లాట్‌ఫామ్ విండ్సర్ఫ్ వ్యవస్థాపక బృందం సభ్యుడు అన్షుల్ రామచంద్రన్ తెలిపారు. 'ఏఐ ప్రభావం పెరుగుతోందని చెబుతున్నవారిలో చాలా మంది ఎలాగైనా కొందరు ఉద్యోగులను తొలగించాలని కోరుకుంటున్నారు. అందుకు ఏఐను సాకుగా వాడుతున్నారు. ఇలాంటి వ్యక్తుల్లో కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ కోసం ప్రత్యేకంగా ఏఐ నమూనాలను రూపొందిస్తున్నారు. మరిన్ని మోడళ్లను విక్రయించడానికి ఇది వ్యాపార వ్యూహంగా పని చేస్తుంది. డెవలపర్ అడాప్షన్, ఎంటర్‌ప్రైజ్ పార్ట్‌నర్‌షిప్ పరంగా అమెరికా తర్వాత భారత్ రెండో అతిపెద్ద మార్కెట్‌గా అవతరిస్తోంది. భారత్‌లో 1.7 కోట్ల మంది డెవలపర్లు ఉన్నారు' అని చెప్పారు. 'వాస్తవంగా కృత్రిమ మేధను అందిపుచ్చుకోవడానికి భారత్‌కు సరిపడా శక్తి ఉంది. భారత్‌లో జీపీయూ క్లస్టర్లను నిర్మించడంపై చురుగ్గా ముందుకెళ్తున్నాం. ఇప్పటికే భారత్‌లోని ప్రముఖ ఐటీ కంపెనీలతో వివిధ స్థాయిల్లో కలిసి పనిచేస్తున్నాం. ఇండియన్ ఐటీ కంపెనీలు తమ అంతర్జాతీయ సహచరుల కంటే వేగంగా కృత్రిమ మేధను ఉపయోగిస్తున్నాయి. అయితే ఈ కంపెనీలు ఇప్పటికే టెక్నాలజీని వివిధ విభాగాల్లో వైవిధ్యపరిచాయి' అని రామచంద్రన్ తెలిపారు.

స్పోర్ట్స్

## ఇంగ్లండ్‌తో తొలి టెస్టుకు భారత జట్టు ఇదే!

# యువ సంచలనానికి నో ఛాన్స్?




క్రికెట్ అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న భారత్-ఇంగ్లండ్ మధ్య టెస్టు సిరీస్ మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు జూన్ 20 నుంచి 24 వరకు లీడ్స్ వేదికగా జరగనుంది. ఈ క్రమంలో తొలి టెస్టు కోసం టీమిండియా భారత ప్లేయింగ్ ఎలెవన్‌ను భారత మాజీ క్రికెటర్ దీప్ దాస్‌గుప్తా ఎంచుకున్నాడు. తన ప్లేయింగ్ ఎలెవన్‌లో దాస్‌గుప్తా ముగ్గురు ఫ్రంట్‌లైన్ పేసర్లు,ఇద్దరు స్పిన్నర్లకు ఛాన్స్ ఇచ్చాడు. అయితే ఈ మ్యాచ్‌తో టెస్టు అరంగేట్రం చేసేందుకు సిద్ధంగా ఉన్న యువ ఆటగాడు సాయిసుదర్శన్‌కు మాత్రం దాస్ గుప్తా తన ఎంచుకున్న జట్టులో చోటు ఇవ్వలేదు. అతడి స్థానంలో వెటరన్ ఆటగాడు కరుణ్ నాయర్ వైపు ఈ మాజీ క్రికెటర్ మొగ్గు చూపాడు. సాయిసుదర్శన్ మంచి ఫామ్‌లో ఉన్నప్పటికి, అనుభవాన్ని పరిగణలోకి తీసకుని కరుణ్‌కు అవకాశమివ్వాలని దీప్ దాస్ గుప్తా సూచించాడు. కాగా నాయర్ దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి ఎనిమిదేళ్ల తర్వాత భారత టెస్టు జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చాడు. ఇక దీప్‌దాస్ గుప్తా ఎంపిక చేసిన జట్టులో స్పిన్నర్లగా రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లకు చోటు దక్కింది. అదేవిధంగా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా శార్దూల్ ఠాకూర్ బదులుగా నితీష్ కుమార్ రెడ్డిని దాస్‌గుప్త ఎంచుకున్నాడు. పేస్ బౌలింగ్ విభాగంలో బుమ్రా, సిరాజ్, ప్రసిద్ద్ కృష్ణలకు అవకాశమిచ్చాడు. ఇంగ్లండ్‌తో తొలి టెస్టుకు దాస్ గుప్తా ఎంపిక చేసిన భారత ప్లేయింగ్ ఎలెవన్

యశస్వీ జైశ్వాల్, కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్, శుబ్‌మన్ గిల్(కెప్టెన్), రిషబ్ పంత్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా,మహ్మద్ సిరాజ్,ప్రసిద్ కృష్ణ

## సెప్టెంబర్ 30 నుంచి మహిళల వన్డే వరల్డ్ కప్




ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ముగియడమే ఆలస్యం మరో మెగా టోర్నీ అభిమానులను అలరించనుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ సోమవారం మహిళల వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ సెప్టెంబర్ 30న షురూ కానుంది. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీ ఆరంభం రోజే టీమిండియా బెంగళూరులో శ్రీలంకతో తలపడనుంది. అయితే.. టీమిండియా, పాకిస్థాన్ మ్యాచ్ అక్టోబర్ 5న జరుగనుంది. పహల్గాం ఉగ్రదాడి.. ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాల నేపథ్యంలో పాక్ మ్యాచ్‌లకు లంక వేదిక కానుందని ఐసీసీ పేర్కొంది. కొలంబోలో ఏకంగా 11 లీగ్ మ్యాచ్‌లకు ఐసీసీ ఆమోదం తెలిపింది. వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా అడుగుపెట్టనుంది. సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న భారత్, శ్రీలంకలు ఫేవరెట్లుగా బరిలోకి దిగనున్నాయి. సెప్టెంబర్ 30 లంక, టీమిండియా పోరుతో మెగా టోర్నీ షురూ కానుంది. అనంతరం అక్టోబర్ 1న న్యూజిలాండ్‌తో ఆసీస్ తలపడనుంది. మొత్తంగా కొలంబోలో 11 లీగ్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. అక్టోబర్ 29న కొలంబో లేదా బెంగళూరులో తొలి సెమీ ఫైనల్ జరుగనుండగా.. అక్టోబర్ 30న బెంగళూరులో రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ ఉండనుంది. టైటిల్ విజేతను నిర్ణయించే ఫైనల్ పోరు నవంబర్ 2న జరుగనుంది. ఈ మ్యాచ్‌కు బెంగళూరు లేదా కొలంబో వేదిక కానుందని ఐసీసీ వెల్లడించింది.

# ఇంగ్లండ్‌తో తొలి టెస్టు.. టీమిండియాకు గుడ్ న్యూస్




లీడ్స్ వేదికగా జూన్ 20న ఇంగ్లండ్‌తో ప్రారంభం కానున్న తొలి టెస్టుకు ముందు టీమిండియాకు గుడ్ న్యూస్ అందింది. ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా స్వదేశానికి వచ్చేసిన హెడ్ కోచ్ గౌతం గంభీర్.. తిరిగి మంగళవారం భారత జట్టుతో కలవనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఏఎన్ఐ వర్గాల సమాచారం ప్రకారం.. గంభీర్ సోమవారం(జూన్ 16) లండన్‌కు బయలుదేరినట్లు తెలుస్తోంది. కాగా ఈ సిరీస్ కోసం గంభీర్ జూన్ 5న భారత జట్టుతో పాటు ఇంగ్లండ్‌కు పయనమయ్యాడు. అతడి నేతృత్వంలో భారత జట్టు నాలుగు రోజుల ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంది.

అయితే తన తల్లి గుండెపోటుతో అస్పత్రిలో చేరడంతో గౌతీ ఉన్నపళంగా జూన్ 11న స్వదేశానికి వచ్చేశాడు. ఇప్పుడు అతడి తల్లి ఆరోగ్యం మెరుగుపడడంతో గంభీర్ తిరిగి ఇంగ్లండ్‌కు పయనమైనట్లు తెలుస్తోంది. ఇక గంభీర్ లేకపోవడంతో భారత జట్టు తమ ప్రాక్టీస్‌ను బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీయస్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో కొనసాగించింది. క్రిక్ బజ్‌రిపోర్ట్స్ ప్రకారం.. టీమిండియా సన్నాహాలను లక్ష్మణ్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. లక్ష్మణ్ భారత జట్టుతో కాకుండా తన వ్యక్తిగత పనుల మీద ఇంగ్లండ్‌కు వెళ్లాడు. కానీ గంభీర్ ఉన్నపళంగా స్వదేశానికి వెళ్లిపోవడంతో లక్ష్మణ్ లౌసాన్ నుండి లండన్‌కు వచ్చినట్లు క్రిక్‌బజ్ తమ రిపోర్ట్‌లో పేర్కొంది. ఇక తొలి టెస్టుకు గిల్ సారథ్యంలోని భారత జట్టు అన్నివిధాల సిద్దమైంది. ఈ టెస్టుకు ముందు ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్‌లో భారత సీనియర్, భారత-ఎ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో రాహుల్, గిల్, శార్దూల్ ఠాకూర్ వంటి మెరుగ్గా రాణించారు. కాగా ఈ సిరీస్ వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో భాగంగా జరగనుంది.

**ఇంగ్లండ్‌తో సిరీస్‌కు భారత జట్టు**

శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్,వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, శార్దూల్ సింగ్ ఠాకూర్, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్ దీప్, ప్రసిధ్ కృష్ణ, మొహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్

# డైరెక్ట్‌గా ఓటీటీలోకి కీర్తి సురేశ్- సుహాస్ మూవీ




తెలుగులో ఫేమస్ పద్యాల్లో 'ఉప్పు కప్పురంబు.. నొక్క పోలికనుండు' ఒకటి. ఈ పద్యాన్నే టైటిల్‌గా పెట్టుకుని ఓ సినిమా వచ్చేస్తోంది. హీరోయిన్ కీర్తి సురేశ్- హీరో సుహాస్ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ ఉప్పు కప్పురంబు. ఈ చిత్రం థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలోనే రిలీజ్ కానుంది. అమెజాన్ ప్రైమ్ తన ఓటీటీ ప్లాట్‌ఫామ్ కోసం రూపొందించిన ఒరిజినల్ మూవీ ఇది.

**ఓటీటీలో..**

ఐవి శశి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎల్లనార్ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై రాధికా లావు నిర్మించారు. సినిమా బండి ఫేమ్ వసంత్ కథ అందించారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ప్రకటించారు. జూలై 4న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నట్లు పోస్టర్ రిలీజ్ చేశారు. చిట్టి జయపురం గ్రామవాసులు అందించే వినోదాల విందుకు సిద్ధంగా ఉండమని ప్రైమ్ వీడియో ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది.



# ఎ ఏంటి.. రాజా సాబ్‌కి సీక్వెల్ కూడానా.. మారుతి ఇచ్చిన క్లారిటీతో ఫ్యాన్స్ షాక్

రెబల్ స్టార్ ప్రభాస్ అరడజను సినిమాల షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఆయన గత కొద్ది రోజులుగా నటిస్తున్న ది రాజా సాబ్ టీజర్ ఈ రోజు విడుదలైంది. ఈ టీజర్‌లో ప్రభాస్ వింటేజ్ లుక్స్ మాత్రం నెక్స్ట్ లెవెల్ అని చెప్పాలి. ముగ్గురు హీరోయిన్ల గ్లామర్ కూడా మరింత జోష్ తీసుకొచ్చింది. ప్రభాస్ కామెడీ, రొమాంటిక్ ట్రాక్ అదిరిపోగా, సంజయ్ దత్ వింత గెటప్స్, ఆ రాజ మహల్ చుట్టూ జరిగే కథ, హారర్ ఎలిమెంట్స్ అన్ని కూడా ప్రేక్షకులకి మంచి మజాని అందించాయి. టీజర్‌లో ప్రభాస్ స్టైలిష్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఫ్యాన్స్‌కి ఫుల్ ట్రీట్ అందించాయి. వీఎఫ్ఎక్స్, తమన్ బీజీఎం మాత్రం టాప్ నాచ్‌లో ఉంది. ఇక కెమెరా వర్క్ కూడా గ్రాండియర్‌గా ఉంది. టీజర్‌తో రాజా సాబ్ మూవీపై భారీ అంచనాలు పెరిగాయి. డిసెంబర్ 5న విడుదల కానున్న ఈ చిత్రం కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రొమాంటిక్ కామెడీ హారర్ థ్రిల్లర్ గా ది రాజా సాబ్ చిత్రం తెరకెక్కుతుండగా, ఈ సినిమా ఎవరి ఊహలకు అందదని మారుతి అన్నారు. ఈ మూవీ రన్ టైం, సీక్వెల్‌పై ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. ఈ సినిమాకు సంబంధించి చాలా కంటెంట్ తీసేసిన మారుతి ఫైనల్‌గా మూడు గంటల పాటు సినిమాని రెడీ చేస్తున్నట్టు చెప్పుకొచ్చాడు. తీయాల్సిన సీన్లు కొన్ని ఉన్నాయి. పాటలు బాలెన్స్. అవన్నీ కలిపితే మూడున్నర గంటలు గ్యారెంటీ. దాన్ని ఎంత ట్రిమ్ చేసినా మూడు గంటల లెక్క తేలుతుంది అని చెప్పుకొచ్చారు. ఇక ది రాజా సాబ్ మూవీకి సీక్వెల్ ఏమైనా ఉంటుందా?' అనే ప్రశ్నకి మారుతి స్పందించారు. పార్ట్ 2 కోసం బలవంతంగా స్టోరీని సాగదీసి రుద్దనని స్పష్టం చేశారు. 'మూవీ పూర్తయ్యాక చూద్దాం. పార్ట్ 2 కోసం బలవంతంగా కథ సాగదీసి రుద్దను. దానిపై ఫుల్ క్లారిటీ మాకు ఉంది. నటీనటులకు 8 గంటల వర్క్ అనేది సాధారణం. కానీ ఈ మూవీ కోసం మేము 18 గంటలు వర్క్ చేశాం. అందుకే టీజర్ సహా ఇంత మంచి అవుట్ పుట్ వచ్చింది.' అని చెప్పుకొచ్చారు. తమన్ అద్భుత మ్యూజిక్ అందిస్తున్నారు. అది సినిమాకే హైలెట్‌గా నిలుస్తుంది. హీరో ఎంట్రీ సాంగ్, ముగ్గురు హీరోయిన్స్‌తో మరో సాంగ్ అన్నీ డార్లింగ్ ఫ్యాన్స్‌తో పాటు ఆడియన్స్ కూడా ఎంజాయ్ చేస్తారని స్పష్టం చేశారు. ఓ అభిమానిగా నా హీరోను ఎలా చూపించాలనుకున్నానో అలానే చూపించా. ప్రభాస్ ప్రత్యేక కామెడీ టైమింగ్‌ను పాన్ ఇండియా స్థాయిలో చూపించాలనుకున్నాం. హారర్ కామెడీ జానర్‌కు డిఫరెంట్‌గా ఈ స్టోరీ ఉంటుంది. ప్రభాస్‌కు నాపై ఉన్న నమ్మకంతో ఈ తరహా కథ చేశాను అని మారుతి చెప్పుకొచ్చారు.



# తండ్రి జేబులో నుండి డబ్బులు కొట్టేసిన అక్కినేని హీరో..

## మరి ఈయన కొడుకులు సంగతేంటి?

తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లు అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. క్రమశిక్షణతో వారిద్దరు తమ నటనా జీవితాన్ని సాగించారు. నేటితరం నటులకు వారు ఆదర్శం. తెలుగుభాషా పరిరక్షణకు అక్కినేని నాగేశ్వరరావు ఎంతో కృషి చేశారు. తెలుగు చిత్రపరిశ్రమను మద్రాసు నుంచి హైదరాబాద్‌కు తీసుకురావడానికి అక్కినేని ముఖ్య కారకుడు. ఏఎన్ఆర్ కేవలం 16 ఏళ్ల వయసులోనే సినీ రంగంలోకి అడుగుపెట్టి తనదైన శైలిలో ప్రేక్షకులని అలరించారు. తుదిశ్వాస వరకు కూడా సినిమాల్లో నటిస్తూ తన ప్రతిభను చాటారు. తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాగేశ్వరరావు , సినీ పరిశ్రమలో ఎన్నో అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు. పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ లాంటి అత్యున్నత పురస్కారాలను అందుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. అక్కినేని నాగేశ్వరరావు తనయుడిగా ఇండస్ట్రీకి వచ్చి తండ్రికి తగ్గ తనయుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నాగార్జున. విదేశాల్లో చదువు పూర్తి చేసుకున్న నాగ్ 'విక్రమ్' సినిమాతో హీరోగా సినీ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం 'మన్మథుడు' అనే ట్యాగ్‌తో మహిళా అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నారు. వరుస విజయాలతో కింగ్ నాగ్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నాగార్జున, త్వరలోనే కుబేర అనే సినిమతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'కుబేర' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ గత రాత్రి హైదరాబాద్‌లో జరగగా, ఈ కార్యక్రమంలో నాగార్జున ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు ఈ ఈవెంట్‌లో యాంకర్ సుమతో నాగార్జున చిట్‌చాట్ లో భాగంగా ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. "అక్కినేని నాగేశ్వరరావు గారి వాలెట్ నుంచి డబ్బులు దొంగతనం చేశారా?" అనే ప్రశ్నకు "అవును, చేశాను!" అని నవ్వుతూ సమాధానమిచ్చారు. డబ్బు సంపాదించాలంటే ఉండకూడని లక్షణాలు ఏంటని అడిగితే, "ఆశ, బద్ధకం" అని తెలియజేశారు. ప్రస్తుత తరం యువతకు ఇచ్చే సలహా ఏమిటన్న ప్రశ్నకు "ఫోన్ చూడటం తగ్గించండి" అని సమాధానం ఇచ్చారు. అయితే నాగ్ కామెంట్స్ పై నెటిజన్లు "మీరూ అందరి మాదిరిగానే తండ్రి పాకెట్‌లోంచి డబ్బులు తీసారా?" అంటూ ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు. అయితే తన కొడుకులు చైతూ, అఖిల్‌లు మాత్రం తన మాదిరిగా డబ్బులు దొంగతనం చేయలేదని స్పష్టం చేశారు. అందుకు కారణం తాను పర్స్ వాడకపోయేవాడినని చెప్పుకొచ్చారు.

# ఓర చూపులతో పిచ్చెక్కిస్తున్న శ్రీలీల



Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
RNI TITLE CODE:TELTEL/2024/89359 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com